


మనస్సు సంతోషంగా ఉన్నప్పుడు విస్తరిస్తుంది; అప్పుడు సమయం చాలా తక్కువగా అనిపిస్తుంది. మనస్సు దుఃఖంలో ఉన్నప్పుడు సంకోచిస్తుంది; అప్పుడు సమయం చాలా సుదీర్ఘంగా అనిపిస్తుంది. మనస్సు సమస్థితిలో (సమత్వంలో) ఉన్నప్పుడు, అది కాలాన్ని అధిగమిస్తుంది. ఈ రెండు తీవ్రస్థాయిల నుండి తప్పించుకోవడానికి, చాలామంది మద్యం లేదా నిద్రను ఆశ్రయిస్తారు. కానీ, మనస్సు మొద్దుబారినప్పుడు లేదా స్పృహలో లేనప్పుడు, అది తనను తాను అనుభవించుకోలేదు. సమాధి - అంటే ఆలోచనలు లేని స్థితి లేదా కాలాతీత స్థితి- అదే నిజమైన శాంతి. అదే అత్యుత్తమ ఉపశమనం. మనస్సు కాలాన్ని అనుభవిస్తున్నట్లే, ఈ క్షణానికి కూడా ఒక ప్రత్యేకమైన మనస్సు ఉంటుంది. ఇది అపారమైన, అనంతమైన వ్యవస్థీకరణ శక్తి కలిగిన 'మహా మనస్సు'. ఆలోచన అనేది ఈ క్షణంలో ఒక అల వంటిది మాత్రమే. సమాధి స్థితిలోని క్షణాలు మనస్సుకు నూతన శక్తిని ప్రసాదిస్తాయి. నిద్రలోకి జారుకునే ముందు లేదా నిద్రలేచిన వెంటనే-అంటే చైతన్యం అస్పష్టంగా ఉండే ఆ సంధి సమయాల్లో- కాలాతీత స్థితిని అనుభవించండి.

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ

www.prajadeevena.com

ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 05 | గురువారం | 12 నవంబర్ 2026 | పేజీలు : 04 వెల ₹ 5

సబ్సిడీల సంబురం

రబీ సీజన్‌లో వాడే యూరియాయేతర ఎరువులకు

రూ.3,230 కోట్లతో ఢిల్లీలో యుగే యుగీన్ భారత్ మ్యూజియం ఏర్పాటు

సూక్ష్మ పరిశ్రమలకు 'ముద్ర' క్రెడిట్ గ్యారెంటీ మరో ఐదేళ్లు

స్టాండప్ ఇండియా పథకం కూడా 2031 దాకా పొడిగింపు

కేంద్ర మంత్రిమండలి నిర్ణయాలు



ప్రస్తుత రబీ సీజన్‌లో ఎరువుల సబ్సిడీకి కేంద్ర ప్రభుత్వం రూ.62,370 కోట్లు కేటాయించింది. 2026 అక్టోబరు నుంచి 2027 మార్చి మధ్య కాలంలో దేశవ్యాప్తంగా రైతులు పంటల్లో వాడే ఫాస్ఫాటిక్, పొటాషిక్(పీకే) ఎరువులకు న్యూట్రియెంట్స్ బేస్డ్ సబ్సిడీ(ఎన్‌బీఎస్) రేట్ల కింద ఈ సబ్సిడీని అందజేస్తారు. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో ఎరువుల సబ్సిడీతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

04

ఉగ్రదాడితో ఉలిక్కిపడ్డ కుల్గాం



బైక్ పై వచ్చి 15 సెకన్లలో 30 రౌండ్ల కాల్పులు

ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలు

వారిలో ఇద్దరి పరిస్థితి విషమం

కశ్మీర్‌లోని కుల్గాంలో ఘటన

04



ఇంటర్ ఇక ఇంటికి

1969 నుంచి కొనసాగుతున్న విధానానికి తెర

కొత్త విధానంలో నర్సరీ నుంచి 4 వరకు ప్రాథమిక విద్య, 5-8 సెకండరీ, 9-12 సీనియర్ సెకండరీ

వచ్చే ఏడాది నుంచి బడుల్లోనే 11, 12 తరగతులు

సీబీఎస్ఈ, మెజారిటీ రాష్ట్రాల్లా 10+2 విధానం

కార్పొరేట్ కాలేజీల ఒత్తిడి ఉన్నా తలొగ్గను

నా నిర్ణయాలు నచ్చకపోతే అధికారులు నిర్మొహమాటంగా నాతోనే చెప్పవచ్చు

సంస్కరణల గురించి అధికారులూ మాట్లాడాలి

డ్రాపౌట్స్‌ను తగ్గించడం, స్కిల్స్ పెంచడమే లక్ష్యం

విద్యాశాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజా దీవెన, హైదరాబాద్ : రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్య ముగియనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 11, 12 తరగతులు పాఠశాల విద్యలో భాగం కానున్నాయి. సీబీఎస్ఈతో పాటు దేశంలో మెజారిటీ రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానానికి అనుగుణంగా రాష్ట్ర విద్యా వ్యవస్థను మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 10ం2 విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరం (2026-27) నుంచే అమలు చేయాలని సీఎం

మిగతా 2 లో



కొందరికి నష్టమొచ్చినా 'మూసీ' ఆగదు

ఏ ఒక్కరికీ నష్టం లేకుండా మూసీ పునరుజ్జీవం

భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందంటే..

కొందరికి నష్టం జరిగినా ఓకే: రేవంత్ రెడ్డి

తమ్మిడికుంట చెరువును ప్రారంభించిన ముఖ్యమంత్రి

పనులు పూర్తిచేసే శక్తి దేవుడు మీకివ్వాలి: నాగార్జున



కాంగ్రెస్ కారణంగానే కరువు కల్లోలం

ఆంధ్రకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లు

చంద్రబాబు 700 కి.మీ. మేర నీళ్లు తీసుకెళ్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారు?

బుద్ధి ఉన్నోడు రేవంత్‌లా మారాలనుకుంటాడా?

సమస్యల కన్నా నా గడ్డంపైనే ఆయనకు ఫికర్

ఇప్పటికైనా రైతు బంధు బకాయిలు చెల్లించాలి

అప్ట గ్రహాలుగా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు

తెలంగాణ కోసం కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి

నిర్మల్ రైతు గర్జన సభలో కేటీఆర్

వివరాలు 3 లో

ఆంధ్రకు నీళ్లు... తెలంగాణకు ఎక్కిళ్లు అన్నట్టుగా పరిస్థితి ఉందని, రైతుల కష్టాలపై సీఎం రేవంత్ రెడ్డికి పట్టింపు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబు 700 కి.మీ మేర కృష్ణా నీటిని తరలించుకుపోతుంటే తెలంగాణ ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇది ఎల్‌నినో తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని మండిపడ్డారు.



న్యాయంకోసం యువతరం తపన

మోదీ సర్కారు కాళ్ల కింద నేల కదిలింది

ఈ ప్రభుత్వం శాశ్వతం కాదు

యువత మన దేశ ఆత్మను తిరిగి సాధిస్తారు

తన ఆత్మకథలో సోనియా

04

రంగనాథ్‌ను రప్పించాల్సిందే

ఓ కోర్టు ధిక్కరణ కేసులో డీజీపీకి హైకోర్టు ఆదేశాలు

మినహాయింపు కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత

కారణాలు సహేతుకంగా లేవని ఆక్షేపణ..17న రావాలన్న కోర్టు

మరో కోర్టు ధిక్కరణ కేసులో మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్‌ను హాజరుపరచాలంటూ కమిషనర్‌కు ఆదేశం



02

ఓ కోర్టు ధిక్కరణ కేసులో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను తమ ఎదుట హాజరుపరిచేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీకి హైకోర్టు సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే కేసులో శంషాబాద్ తహసీల్దార్ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీసులను ఆదేశించింది.

ఇంటర్ ఇక ఇంటికి

మొదటి పేజీ తరువాయి

భావించినా, సమయం సరిపోదని అధికారులు చెప్పడంతో వాయిదా పడింది. ఈసారి తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని బుధవారం జరిగిన సమీక్షలో సీఎం తేల్చిచెప్పారు. దీంతో ఉమ్మడి రాష్ట్రంలో పీవీ నరసింహారావు విద్యామంత్రిగా ఉన్నప్పుడు 1969–70లో మొదలైన ఇంటర్ విధానం దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత ముగియనుంది. కొత్త విధానంలో నర్సరీ నుంచి 4వ తరగతి వరకు ప్రాథమిక విద్య, 5 నుంచి 8 వరకు సెకండరీ, 9 నుంచి 12 వరకు సీనియర్ సెకండరీ విద్యగా పునర్ వ్యవస్థీకరించాలని సీఎం ఆదేశించారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. దేశంలో 18 రాష్ట్రాల్లో 10ం2 విధానమే అమల్లో ఉందని, విద్యార్థుల ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. విద్యాశాఖలో తాను తీసుకునే ప్రతి నిర్ణయానికి విద్యార్థే కేంద్రమని, మరే అంశానికీ తావు లేదని అన్నారు.

కార్పొరేట్ ఒత్తిడికి తలొగ్గను

'ప్రభుత్వ నిర్ణయంతో కార్పొరేట్ కాలేజీలకు నష్టం జరుగుతుంది. దీనిపై నా మీద తీవ్ర ఒత్తిడి ఉంది. అయినా విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఎక్కడా తలొగ్గకుండా ముందుకు వెళ్తున్నా' అని సీఎం ఉన్నతాధికారులతో అన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వమే కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రకటించామన్నారు. తన నిర్ణయాల్లో లోటుపాట్లు ఉంటే నేరుగా తనకే చెప్పాలని, మరింత మెరుగ్గా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తన నిర్ణయాలు నచ్చకపోతే అధికారులు తమ అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పవచ్చన్నారు. 'ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత మీ అందరిదీ. విద్యారంగంలో సంస్కరణల గురించి నేనొక్కడినే చెబితే సరిపోదు. మీరందరూ మాట్లాడాలి' అని కోరారు.

పదో తరగతి తర్వాత 40 శాతం డ్రాపౌట్

పదో తరగతి తర్వాత సగటున 40శాతం విద్యార్థులు చదువు మానేస్తున్నారని సీఎం చెప్పారు. వారిలో ఎక్కువ మంది బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పిల్లలేనని అన్నారు. 11, 12 తరగతులు బడుల్లోనే ఉండే కేంద్రీయ, నవోదయ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో డ్రాపౌట్లు తక్కువగా ఉన్నాయని గుర్తుచేశారు. డ్రాపౌట్లను అరికట్టడం, విద్యార్థుల్లో భాషా, సమాచార నైపుణ్యాలు పెంచడమే కొత్త విధానం లక్ష్యమని వివరించారు. 12వ తరగతి తర్వాత విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్టు ఎంచుకుని అందులో నిపుణులుగా ఎదిగే అవకాశం ఉండాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థిపై ఏడాదికి సగటున రూ.1.08 లక్షలు ఖర్చవుతోందని చెప్పారు. ఇంటర్ కాలేజీల విలీనంతో అది



రూ.60 వేలకు తగ్గుతుందని, మిగిలే రూ.48 వేలను మళ్లీ విద్యా రంగానికే వెచ్చిస్తామని తెలిపారు. నర్సరీ నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు నాణ్యమైన బోధనతో విద్యార్థులను ఆధునిక ప్రపంచ అవసరాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, అందులో భాగంగానే ఈ సంస్కరణలని చెప్పారు. జూనియర్ కాలేజీల లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది ఉద్యోగ, పదవీ విరమణ ప్రయోజనాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని హామీ ఇచ్చారు.

జూనియర్ కాలేజీలే సీనియర్ సెకండరీ బడులు

సీఎం ఆదేశాలతో ఇంటర్ విద్య పాఠశాల విద్యలో విలీనం కానుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 436 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు పాఠశాల విద్యా శాఖ పరిధిలోకి వస్తాయి. వచ్చే ఏడాది నుంచి ఇవి 9–12 తరగతులతో సీనియర్ సెకండరీ స్కూళ్లుగా మారనున్నాయి. దాదాపు అన్ని కాలేజీలకు విశాలమైన స్థలం ఉండటంతో, వాటిలోనే 9, 10 తరగతులు ప్రారంభించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. అదనపు తరగతి గదులు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తే ఈ భవనాలు సరిపోతాయని ఇంటర్ బోర్డు ప్రతిపాదిస్తోంది. చాలా కాలేజీలు ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు 0–5 కి.మీ. దూరంలోనే ఉన్నాయి. అందువల్ల 8వ తరగతి పూర్తయ్యాక విద్యార్థులు దగ్గర్లోని కాలేజీ భవనాల్లో 9–12 తరగతుల్లో చేరడానికి ఇబ్బంది ఉండదని బోర్డు చెబుతోంది.

మండలానికో '12వ తరగతి' బడి

ఆరుట్ల తరహాలో 120 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్) ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఇవి ఏడాదిలో అందుబాటులోకి వస్తాయి. మరో 300 టీపీఎస్‌ల కోసం నాబార్డు రుణానికి దరఖాస్తు చేసింది. రుణం మంజూరైతే టీపీఎస్‌ల సంఖ్య 420కి చేరుతుంది. 12వ తరగతి వరకు బోధిస్తున్న 195 మోడల్ స్కూళ్లను కలిపితే 615 బడులు అవుతాయి. ప్రభుత్వ, జడ్పీ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు ఒకే చోట ఉన్న 70 సంస్థలను కూడా కలిపితే మొత్తం 685 సంస్థల్లో 12వ తరగతి వరకు బోధన సాధ్యమని విద్యాశాఖ చెబుతోంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 621 మండలాలు ఉన్నాయి. కొత్త టీపీఎస్‌లు పూర్తయితే ప్రతి మండలంలో 12వ తరగతి వరకు ఉండే కనీసం ఒక బడి ఉంటుందని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

1న అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి నోటిఫికేషన్

అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు డిసెంబరు 1న నోటిఫికేషన్ ఇచ్చి, ఏప్రిల్ 30 లోపు ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. వర్సిటీల్లో దాదాపు 900 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, అంబేద్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి సీఎం దృష్టికి తెచ్చారు. వీటి భర్తీకి సీఎం సానుకూలంగా స్పందించారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ అద్దె భవనాల్లో కొనసాగకూడదని స్పష్టం చేశారు. అన్ని వసతులతో సొంత భవనాలు నిర్మించాలని, బడులు, హాస్టళ్లలో మరుగుదొడ్లు, నీటి వసతి కల్పించాలని ఆదేశించారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎస్ సంజయ్ జాజు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు డైరెక్టర్ అఖిలాష అభినవ్, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

కొందరికి నష్టమొచ్చినా 'మూసీ' ఆగదు

ఏ ఒక్కరికీ నష్టం లేకుండా మూసీ పునరుజ్జీవం
చెరువుల చెర విడిపిస్తాం.. ఇక తమ్మిడికుంట ఫేమస్
భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందంటే..
కొందరికి నష్టం జరిగినా ఓకే: రేవంత్ రెడ్డి
హైడ్రా పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువును ప్రారంభించిన ముఖ్యమంత్రి
మూసీ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికీ ఆహ్వానించాలి
పనులు పూర్తిచేసే శక్తి దేవుడు మీకివ్వాలి: నాగార్జున



ప్రజా దీవెన, హైదరాబాద్ : "మూసీ ప్రక్షాళన చేయాల్సిందే. ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా ఆ నది పునరుజ్జీవ ప్రాజెక్టును చేపడతాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకు రాజకీయాలకతీతంగా సహకరించాలని.. అందరూ ఒకే వేదికపైకి రావాలని ఆయన కోరారు. 55 కిలోమీటర్ల మేర ఉన్న మూసీ ప్రక్షాళనలో భాగంగా.. 21 కిలోమీటర్ల మేర పనులకు అన్ని అనుమతులూ వచ్చాయని, త్వరలో పనులు మొదలు పెడతామని ఆయన తెలిపారు. ఐటీ కారిడార్‌లో రూ.20 కోట్లతో హైడ్రా పునరుద్ధరించిన తమ్మిడికుంటను.. సినీనటుడు అక్కినేని నాగార్జున, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన.. ప్రపంచంలో ఎక్కడైనా నదీ పరీవాహక ప్రాంతాల్లో అభివృద్ధి జరిగిందని, అమెరికా, సింగపూర్, దక్షిణ కొరియా వంటి దేశాలు నదుల తీర ప్రాంతాలను పర్యాటక, ఆర్థిక చోదక శక్తులుగా తీర్చిదిద్దాయని పేర్కొన్నారు. అదే తరహాలో హైదరాబాద్, తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవాలన్నదే తన ఆలోచన అని స్పష్టం చేశారు. 'నా సంకల్పం మంచిదైనప్పుడు.. నేను చేసే పని భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతున్నప్పుడు. కొందరికి నష్టం జరుగుతుందని ఎందుకు వెనక్కి తగ్గాలి' అని ప్రశ్నించారు. ఔటర్ లోపల ఉన్న 1.34 కోట్ల మందితోపాటు.. నల్గొండ జిల్లాలోని 30 లక్షల మంది మూసీ కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరముందని రేవంత్ అభిప్రాయపడ్డారు. మెడికల్, ఇతర వ్యర్థాల డంపింగ్ కేంద్రంగా మూసీ నది మారిందని, ఈ పరిస్థితిని పూర్తిగా మార్చి ఆ నదిని ప్రజలకు ఉపయుక్తంగా, రాష్ట్ర ఆదాయానికి చోదక శక్తిగా తీర్చిదిద్దుతామఇ చెప్పారు. అలాగే.. హైదరాబాద్‌లో చెరువుల చెర విడిపించాల్సిందేనని, కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించాల్సిందేనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బతుకమ్మకుంట, సున్నం చెరువు, నల్ల చెరువు, ఫాక్స్ సాగర్, మియాపూర్ చెరువు తదితర 20 చెరువులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. తమ్మిడికుంటను అభివృద్ధి చేయాలని నిర్ణయించినప్పుడు కొంత ఇబ్బందికరమైన పరిస్థితి తలెత్తిందని, ప్రభుత్వపరంగా తీసుకున్న నిర్ణయాలు చిరకాల పరిచయమున్న నాగార్జున, ఇతర మిత్రుల మనసుకు కష్టంగా అనిపించాయని.. సర్కారు నిర్ణయం వల్ల వారికి కొంత నష్టం కూడా జరిగిందని ఆయన వెల్లడించారు. అయితే, కొందరికి నష్టం జరిగినా.. కొన్ని తరాలకు మంచి జరుగుతుందన్న ఆలోచనతోనే చెరువుల పునరుద్ధరణ, పునరుజ్జీవానికి శ్రీకారం చుట్టామన్నారు. పెద్ద మనసుతో ఈ విషయాన్ని అర్థం చేసుకొన్న నాగార్జున రెండెకరాల స్థలాన్ని ఉదారంగా ఇచ్చి.. సినిమాల్లోనే కాదు.. నిజ జీవితంలో హీరో అని నిరూపించుకున్నారన్నారు. ఎక్కడో షూటింగ్‌లో ఉన్న ఆయన.. ప్రభుత్వం తరపున ఆహ్వానిస్తే.. ప్రత్యేకవిమానంలో వచ్చారని చెప్పారు. నాగార్జున నిజమైన హైదరాబాదీ అని, ప్రకృతి పరిరక్షణకు ఆయన ఎప్పుడూ ముందుంటారని రేవంత్ ఆకాంక్షించారు.

వాటితోపాటు..

ఇప్పటి వరకు హైటెక్ సిటీ, శిల్పారామం, హైటెక్స్ గురించి మాత్రమే మాట్లాడుకున్నారని, మూడింటి మధ్య ఉన్న తమ్మిడికుంట గురించి మాట్లాడేలా దాన్ని అభివృద్ధి చేశామని సీఎం తెలిపారు. ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రం హోం కాదు.. వర్క్ ఫ్రం తమ్మిడికుంట చేసేలా ఏర్పాట్లు చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, సీఎంసీ కమిషనర్ సృజనలకు సూచించారు. ఈ సందర్భంగా రామంతాపూర్ పెద్ద చెరువులో గుడిసెలు ఇళ్లు కోల్పోయిన 34 మందికి నాచారం– మల్లాపూర్ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయింపు పత్రాలు అందజేశారు.

తమ్మిడికుంట దగ్గర షూటింగ్‌లు చేస్తా: నాగార్జున

"తమ్మిడికుంటను చాలా రోజులుగా చూస్తున్నా.. ఇక్కడి పరిస్థితిని చూస్తే బాధ కలిగేది. కానీ చాలా సుందరంగా చెరువును తీర్చిదిద్దార"ని ఈ కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటుడు నాగార్జున అన్నారు. తాను ఇప్పుడు డ్యూన్స్‌లు చేయడం లేదు కానీ.. ఇక్కడ షూటింగ్‌లు చేస్తానని పేర్కొన్నారు. చెరువులు, నదులంటే రేవంత్‌రెడ్డికి ఇష్టమని, వాటి పునరుజ్జీవానికి ఆయన తీసుకుంటున్న చర్యలు అద్భుతమని ప్రశంసించారు. నగరం చుట్టూ ఉన్న అన్ని చెరువులనూ ఇదే తరహాలో అభివృద్ధి చేయాలని సీఎంను నాగార్జున కోరారు. "మూసీ నది ప్రారంభోత్సవానికి కూడా నన్ను పిలుస్తారని ఆశిస్తున్నా. ఆ ప్రాజెక్టు పూర్తి చేసే శక్తి సీఎంకు ఇవ్వాలని ప్రార్థిస్తున్నా" అని ఆయన పేర్కొన్నారు.

ఉగ్రదాడితో ఉలిక్కిపడ్డ కుల్గాం

బైక్ పై వచ్చి 15 సెకన్లలో 30 రౌండ్ల కాల్పులు
ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలు.. వారిలో ఇద్దరి పరిస్థితి విషమం
కశ్మీర్ లోని కుల్గాంలో ఘటన



శ్రీనగర్ : జమ్మూకశ్మీర్లో సీఆర్పీఎఫ్ క్యాంపుపై ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారు. ఓ ద్విచక్ర వాహనంపై దూసు కొచ్చిన ఇద్దరు ఉగ్రవాదులు.. భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఏకే 17 తుపా కీతో 15 సెకన్లలో 30 రౌండ్ల కాలు' లు జరిపి పారిపోయారు. ఈ దాడిలో ముగ్గురుజవాన్లకు తీవ్రగాయాలవ్వగా.. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కులాం జిల్లా మీర్బజార్ సమీపంలోని చెకోపోస్టు వద్ద బుధవారం మధ్యాహ్నం 2.15 గంటల సమ యంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దాడికి పాల్పడిన నిందితుల్లో ఒకరిని లష్కరే తోయిబాకు చెందిన విదేశీ ఉగ్ర వాదిగా అనుమానిస్తున్నారు. బైక్ వచ్చి కాల్పులు జరుపు తూనే ఉగ్రవాదులు పారిపోయారని అప్రభతమైన జవాన్లు కూడా ఎదురు కాల్పులు జరిపారని ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. గాయపడిన ముగ్గురు జవా న్లలో ఇ ద ్ ం ం కానిస్టేబుళ్లు, మరొకరు హెడ్ కాని"సేబుల్ అని.. వారిని అనంతనాగ్లోని ఆస్పత్రికి తరలించామని వెల్లడించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. పారిపోయిన ఉగ్రవాదులను పట్టుకునేం దుకు పెద్ద ఎత్తున సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు.

కృత్రిమ మేధతో పదేళ్లలో క్యాన్సర్ కనుమరుగు!

అల్జీమర్స్, గుండెజబ్బులు, మానసిక సమస్యలూ..
ఏళ్ల తరబడి జరిగే పరిశోధనలు ఇక వారాల్లోనే
మానవాళికి అద్భుత వైద్యసేవలు అందుబాటులోకి
ఆంథ్రోపిక్ సీఈవో డారియో ఎమోడై వ్యాఖ్య
వైద్యరంగంలో సంచలనాలు నమోదవుతాయి
పలు ఏఐ కంపెనీల అధిపతుల అంచనాలు
ఖండించిన ఔషధ తయారీ సంస్థలు

వాషింగ్టన్ : కృత్రిమమేధ (ఏఐ) రంగంలో కొనసాగుతున్న అభివృద్ధితో రానున్న పదేళ్లలోపే క్యాన్సర్, అల్జీమర్స్, గుండెజబ్బులు, మానసిక వ్యాధులు కనుమరుగవుతాయని ప్రముఖ ఏఐ కంపెనీ ఆంథ్రోపిక్ సీఈవో డారియో ఎమోడై అభిప్రాయపడ్డారు. వెయ్యి సంవత్సరాలుగా మానవాళిని ఇబ్బంది పెడుతున్న పలు వ్యాధులను నిర్మూలించి, అద్భుతాలను సృష్టించే కాలం త్వరలో సాకారం కానుందన్నారు. ఏఐతో వైద్యరంగంలో సంచలనాలు నమోదవుతాయని ఇతర ఏఐ కంపెనీ అధిపతులు కూడాపేర్కొనటం విశేషం. వైద్య పరిశోధనలకు పట్టే దశాబ్దాల కాలాన్ని ఏఐ కొన్ని వారాలకు కుదిస్తుందని, తద్వారా పదేళ్లలో అన్ని రకాల వ్యాధులకు పరిష్కారాలు ఆవిష్కృతమవుతాయని లేదా వ్యాధులే కనుమరుగవుతాయని గూగుల్ ఏఐ విభాగం ఇంఛార్జి డెమిస్ హసబిస్ పేర్కొన్నారు. జీవశాస్త్రరంగంలో జరిగే పరిశోధనలను ఏఐ విప్లవాత్మకంగా మార్చి వేస్తుందని, 20 కోట్లకుపైగా ప్రోటీన్ ఆకృతులను మ్యాపింగ్ చేసిన ఆల్ఫాఫోల్డ్ దీనికి ఒక ఉదాహరణ అని చెప్పారు. అమెరికా అధ్యక్షుడికి ఎటువంటి వైద్యసేవలు అందుబాటులో ఉంటాయో.. రానున్న రోజుల్లో మానవాళికి అంతటికీ ఆ స్థాయి వైద్యసేవలు లభిస్తాయని, ఏఐతో ఇది సాధ్యం కానుందని ఎలాన్ మస్క్ ఇటీవల పేర్కొన్నారు.

ఏఐ మోడల్స్‌కు అంత పరిజ్ఞానం లేదు

ఔషధ కంపెనీలు మాత్రం ఈ అంచనాలను తోసిపుచ్చుతున్నాయి.ఇవన్నీ పనికిమాలిన మాటలని వర్టెక్స్ ఫార్మా కార్యనిర్వాహక చైర్మన్ జెఫ్ లీడెన్ పేర్కొన్నారు. ఏఐ సామర్థ్యాన్ని పరీక్షించటం కోసం తాము దాదాపు 10 వేల ఔషధ సమ్మేళనాల వివరాలను 50ఏఐ కంపెనీలకు ఇచ్చామని, ఏ కంపెనీ కూడా తమంతట తాము ఒక్క ఔషధాన్నీ రూపొందించలేకపోయిందని వెల్లడించారు. ఇదే అభిప్రాయాన్ని ఇతర ఔషధ కంపెనీల అధిపతులు కూడా వ్యక్తం చేశారు. ఏఐతో కొత్త అణువుల ఆవిష్కరణలు వేగవంతమవుతాయని, అయితే.. ఒక ఔషధం తయారీలో ఇది ప్రారంభం మాత్రమేనని తెలిపారు. ఆ తర్వాత ప్రయోగశాలలో జంతువుల మీద ప్రయోగాలు, ఆ తర్వాత మనుష్యుల మీద పరీక్షలు, నిపుణుల, ప్రభుత్వ సంస్థల సమీక్షలు వంటి దశలన్నింటినీ దాటుకొని ఒక కొత్త ఔషధం మార్కెట్లోకి విడుదలవుతుందని గుర్తు చేశారు. ఏఐ ఎంత అభివృద్ధి చెందినా ఈ దశలన్నీ ఉంటాయని, వీటికి 10–12 ఏళ్ల సమయం పడుతుందని పేర్కొన్నారు. విశ్వసనీయమైన వైద్య చికిత్సలను అభివృద్ధి చేయటానికి కావాల్సిన లోతైన జీవశాస్త్ర పరిజ్ఞానం ప్రస్తుత ఏఐ మోడల్స్‌కు లేదని తెలిపారు.

సూపర్ పీఎం అయ్యేందుకే సోనియా త్యాగం

సోనియా ఆత్మకథపై బీజేపీ విమర్శలు

న్యూఢిల్లీ : సోనియా ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంలోని అంశాలపై వివాదం కొనసాగుతూనే ఉంది. దేశ ప్రధాని పదవిని తాను తిరస్కరించానని పుస్తకంలో సోనియా పేర్కొనడంపై బీజేపీ బుధవారం కూడా విమర్శలు కురిపించింది. సూపర్ పీఎం అయ్యేందుకే సోనియా పీఎం (ప్రధానమంత్రి) పదవిని త్యాగం చేశారని బీజేపీ అధికార ప్రతినిధి సుదాన్షు త్రివేది విమర్శించారు. "సోనియా గాంధీ పీఎం పోస్టును విడిచిపెట్టి, యూపీఏ హయాంలో జాతీయ సలహా మండలి చైర్‌పర్సన్ పదవిని క్యాబినెట్ ర్యాంక్‌తో తీసుకున్నారు. ఈ తరహా త్యాగాన్ని ప్రపంచంలో మరెక్కడా చూసి ఉండరు"అని త్రివేది ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఇక, సోనియా తన ఆత్మకథ పుస్తకంలో జేడీయూ అధినేత నితీశ్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యల పట్ల ఆ పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఇండియా' కూటమి నుంచి బయటకు వెళ్లేందుకు నితీశ్ కుమార్ అవకాశం కోసం ఎదురుచూశారని, ఆయన బీజేపీ ప్రభావంలో ఉన్నారని సోనియా పేర్కొన్నారు. దీనిపై జేడీయూ నేత రాజీవ్ రంజన్ ప్రసాద్ స్పందిస్తూ.. ప్రతిపక్ష ఇండియా కూటమిని ఏర్పాటు చేయడంలో నితీశ్ కీలకంగా వ్యవహరించడాన్ని గుర్తు చేశారు

తమిళనాడు తరహా రిజర్వేషన్ల కోసం సుప్రీం కోర్టుకు కర్ణాటక ప్రభుత్వం

బెంగళూరు : తమిళనాడు తరహాలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల పెంపును అమలుచేసే వెసులుబాటును కల్పించాలని కోరుతూ కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి పరమేశ్వర్ బుధవారం మీడియాకు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు రిజర్వేషన్లను పెంచుతూ, మొత్తం రిజర్వేషన్లను 56న ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి హైకోర్టు అభ్యంతరం తెలిపిందని, రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని ఆదేశించిందని చెప్పారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగంలోని షెడ్యూల్–9 కింద చేర్చి రక్షణ కల్పించారని, పొరుగు రాష్ట్రంలో 69 శాతం రిజర్వేషన్ అమలులో ఉన్నప్పుడు కర్ణాటకలో ఎందుకు వర్తించదని ప్రశ్నించారు.

కాంగ్రెస్ కారణంగానే కరువు కల్లోలం

ఆంధ్రకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లు

చంద్రబాబు 700 కి.మీ. మేర నీళ్లు తీసుకెళ్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారు?

బుద్ధి ఉన్నోడు రేవంత్‌లా మారాలనుకుంటాడా?

సమస్యల కన్నా నా గడ్డంపైనే ఆయనకు ఫికర్

ఇప్పటికైనా రైతు బంధు బకాయిలు చెల్లించాలి

అష్ట గ్రహాలుగా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు

తెలంగాణ కోసం కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి

నిర్మల్ రైతు గర్జన సభలో కేటీఆర్



ప్రజా దీవెన, నిర్మల్ : ఆంధ్రకు నీళ్లు... తెలంగాణకు ఎక్కిళ్లు అన్నట్టుగా పరిస్థితి ఉందని, రైతుల కష్టాలపై సీఎం రేవంత్ రెడ్డికి పట్టింపు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబు 700 కి.మీ మేర కృష్ణా నీటిని తరలించుకుపోతుంటే తెలంగాణ ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇది ఎల్‌నినో తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని మండిపడ్డారు. నిర్మల్‌లో బుధవారం నిర్వహించిన రైతు గర్జన సభలో కేటీఆర్ ప్రసంగించారు. పెండింగ్‌లో ఉన్న మూడు విడతల రైతుబంధుతో పాటు యాసంగి రైతుబంధును తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇస్తామన్న బోనస్ బోగస్‌గా మారిందని, యూరియా కోసం క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ఆక్షేపించారు. వృథాగా పోతున్న లక్ష క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలని జూలైలోనే సూచించినా ముఖ్యమంత్రి పట్టించుకోలేదని విమర్శించారు. సర్కారు నిర్లక్ష్యం కారణంగా రైతుల ఇంటి ముందు మళ్లీ చావు దప్పు మోగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం, సీతారామ, భక్త రామదాసు, సదర్‌మాట్ వంటి ప్రాజెక్టులను నిర్మించి సాగునీటి రంగానికి ప్రాధాన్యం ఇచ్చామని గుర్తు చేశారు. విద్యుత్ కష్టాలను తొలగించి, సింగరేణికి కొత్త జీవం పోశామని పేర్కొన్నారు. 4.5 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రం పరిస్థితి మరోలా ఉండేదని వ్యాఖ్యానించారు. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు, హక్కులను సాధించడంలో బీజేపీకి చెందిన 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు విఫలమయ్యారని కేటీఆర్ విమర్శించారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నోరెత్తేందుకు కూడా సాహసించడం లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అష్ట గ్రహాలుగా మారారని ధ్వజమెత్తారు. ప్రశ్నించలేని నాయకులకు ఓట్లేసి లాభమేంటో ఒక్కసారి ఆలోచించాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్‌ను ఉద్దేశించి.. చెప్పులు మోసే పార్టీ ఒకటి, సంచులు మోసే పార్టీ మరొకటి అని విమర్శలు గుప్పించారు. ఈ రెండు పార్టీలను ఢిల్లీ వరకు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు చూశారని, మళ్లీ మోసపోతే గోసపడతామని హెచ్చరించారు. తెలంగాణ ప్రగతి రథచక్రం ముందుకు సాగాలంటే కేసీఆర్ తిరిగి సీఎం కావాలని ఆకాంక్షించారు. "కేటీఆర్ ఎన్నటికీ రేవంత్ కాలేడు" అని సీఎం చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. "బుద్ధి ఉన్నోడు ఎవడైనా రేవంత్‌లా మారాలనుకుంటాడా? ప్రజలు ఆయన్ను తిట్టే తిట్లు వింటే.. మరొకరైతే బకెట్లో దూకి చచ్చిపోతుండె. రాష్ట్ర సమస్యలకంటే నా గడ్డంపైనే ఆయనకు ఎక్కువ ఫికర్ ఉంది. ఇంకా నేను నకలు కొడుతున్నానంటూ సిగ్గు లేకుండా మాట్లాడుతున్నడు" అని ధ్వజమెత్తారు.

బకాయిలు బరించలేము

కానీ.. ఆ మొత్తం చెల్లించే పరిస్థితి ఇప్పుడు లేదు

హైకోర్టుకు స్వయంగా వెల్లడించిన ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

ప్రజా దీవెన, హైదరాబాద్ : ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూముల యజమానులకు చేయాల్సిన చెల్లింపులు సహా వివిధ క్యాటగిరీల్లో మొత్తం రూ.40 వేల కోట్ల మేర బిల్లులు చెల్లించేందుకు టోకెన్లు జారీ చేశామని.. అయితే ప్రస్తుతానికి వెంటనే చెల్లించే పరిస్థితి లేదని సర్కారు హైకోర్టుకు తెలిపింది. వివిధ ప్రాజెక్టుల కోసం చేసిన భూసేకరణలో భాగంగా భూములు కోల్పోయిన యజమానులు, రైతులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో హైకోర్టులో పలు కోర్టు ధిక్కరణ పిటిషన్లు నమోదయ్యాయి. అయితే వాటిపై వివరణ ఇవ్వాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను హైకోర్టు గతంలో ఆదేశించింది. బుధవారం జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ఎదుట సందీప్‌కుమార్ ఆన్‌లైన్‌లో హాజరై వివరణ ఇచ్చారు. 'ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేసిన రైతులకు పరిహారం చెల్లించడమనేది సర్కారు మొదటి ప్రాధాన్యంగా ఉంది. అయితే ప్రస్తుతానికి చెల్లింపులు చేసే స్థితిలో ప్రభుత్వం లేదు. అది నా అసమర్థత. ఏదేమైనా ఒక్కొక్కటిగా వీలైనంత వేగంగా వారికి చెల్లింపులు చేస్తాం. వీటిని క్లియర్ చేయడానికి కనీసం 6 నెలల సమయం పడుతుంది' అని వెల్లడించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రస్తుతం తమ ఎదుట ఉన్న కేసుల్లో దాదాపు రూ.51 కోట్లను 12 వారాల్లో చెల్లించేందుకు చివరి అవకాశమిస్తున్నట్లు తెలిపింది. సకాలంలో చెల్లింపులు చేయకపోవడం వల్లే కేసులు పెరిగిపోతున్నాయని వ్యాఖ్యానించింది. అలాగే వివిధ ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన యజమానులకు చెల్లించాల్సిన పరిహారం ఎంత.. వాటికి ఎంత సమయం పడుతుందనే వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని సందీప్‌కుమార్‌ను ఆదేశించింది. ఇటు.. తొలుత సందీప్‌కుమార్ వ్యక్తిగతంగా విచారణకు హాజరుకాకపోడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలాంటి కారణం లేకుండా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఎలా కోరతారని మండిపడింది. 'కోర్టు అంటే అధికారులకు కనీస గౌరవం ఉండట్లేదు. ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేసిన భూయజమానులకు చెల్లించాల్సిన పరిహారం, సంబంధిత కోర్టు ధిక్కరణ కేసులను మేం తేలికగా తీసుకోబోం' అని ఘాటుగా వ్యాఖ్యానించింది. దీంతో సందీప్‌కుమార్ వర్చువల్‌గా కోర్టు ఎదుట హాజరై వివరణ ఇచ్చారు.

'స్పెక్ట్రా'కు హైకోర్టు నోటీసులు

రియల్ ఎస్టేట్ స్కాం ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశం

ప్రజా దీవెన, హైదరాబాద్ : రియల్ ఎస్టేట్ కుంభకోణం, భారీగా రెరా నిబంధనల ఉల్లంఘన, భారీ ఎత్తున నిధుల అక్రమ మళ్లింపు తదితర ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ స్పెక్ట్రా గ్రూప్ కంపెనీలైన స్పెక్ట్రా ఇండియా ఎకో ప్రాజెక్ట్స్, స్పెక్ట్రా ఇండియా హౌసింగ్, స్పెక్ట్రా ఇండియా మెగా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ తదితర కంపెనీలను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ నోటీసులు జారీ చేసింది. స్పెక్ట్రా గ్రూప్ కంపెనీలు భారీ రియల్ ఎస్టేట్ కుంభకోణానికి పాల్పడ్డాయని పేర్కొంటూ 'ది రైట్ సొసైటీ' అనే సంస్థ ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసింది. దీనిపై బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శాంకోషీ, జస్టిస్ చలపతిరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ సంస్థ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామనే హామీతో స్పెక్ట్రా గ్రూప్ కంపెనీలు ప్రజల నుంచి దాదాపు రూ.5 వేల కోట్లకు పైగా వసూలు చేశారని.. ఈ నిధులను అక్రమంగా గ్రూప్ కంపెనీలకు మళ్లించడం ద్వారా ఆర్థిక, రియల్ ఎస్టేట్ అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. వాదనలు విన్న కోర్టు.. వివరణ సమర్పించాలంటూ స్పెక్ట్రా గ్రూప్ కంపెనీలను ఆదేశిస్తూ, విచారణను వచ్చే నెల 23వ తేదీకి వాయిదా వేసింది.

నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తెలంగాణ విద్యావ్యవస్థను తీర్చిదిద్దుతాం: భట్టి విక్రమార్క

కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు శంకుస్థాపన



ప్రజా దీవెన, కాజీపేట : తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించి, ప్రపంచ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కాజీపేటలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. అందుకే విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. మహాత్మాగాంధీ స్ఫూర్తి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలకు అనుగుణంగా దేశంలోనే ఆదర్శంగా నిలిచేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యారంగాన్ని బలోపేతం చేసి, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తెలంగాణ విద్యావ్యవస్థను తీసుకెళ్లడమే ప్రభుత్వ సంకల్పమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

ఈవీ, ఆటోమొబైల్స్‌లో అపార అవకాశాలు

ముందుకు రండి.. గ్లోబల్ సమ్మిట్-26లో భాగస్వాములవ్వండి

పారిశ్రామిక వేత్తలకు మంత్రి పొన్నం పిలుపు

ప్రజా దీవెన, హైదరాబాద్ : ఆటోమొబైల్, ఆటో కాంపొనెంట్స్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, బ్యాటరీ టెక్నాలజీ, ఈవీ చార్జింగ్ వంటి రంగాల్లో భారీ పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలు.. తమ పరిశ్రమలను మరింత విస్తరించడంతో పాటు కొత్త పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన ఆటోమొబైల్, ఆటో కాంపోనెంట్స్, ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ) రంగాల తొలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం సచివాలయంలో బుధవారం మంత్రి పొన్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 7 నుంచి 9 వరకు జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026లో ఆటోమొబైల్, ఈవీ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

తెలంగాణను కాలుష్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రెండేళ్ల క్రితమే ఈవీ పాలసీని తీసుకొచ్చామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఆటోమొబైల్, మొబిలిటీ రంగాల అభివృద్ధికి మూడు పారిశ్రామిక పార్కులు, మొబిలిటీ క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పెట్టుబడిదారులకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ద్వారా భారీ పెట్టుబడులు, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న పారిశ్రామిక వేత్తలు, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన అవకాశాలున్నాయని, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ విజయవంతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

ఆస్తి పన్ను మదింపు తప్పనిసరి

ఆస్తి పన్ను నంబరు ఉంటేనే.. రిజిస్ట్రేషన్

భవనం, ప్లాట్, ఓపెన్ ప్లాట్లకు పీటీఐఎన్/పీఎల్‌టీఐఎన్ నంబర్ ఉండాల్సిందే!

ఆ నంబరు నమోదు చేస్తేనే స్లాట్ బుకింగ్

లేకపోతే పీటీఐఎన్ తీసుకుని, పన్ను కట్టాకే రిజిస్ట్రేషన్

ఒకవేళ అత్యవసరమైతే పెండింగ్ రిజిస్ట్రేషన్ వెసులుబాటు

నంబరు తీసుకుని, పన్ను చెల్లించాకే డాక్యుమెంట్ విడుదల

క్యూర్ పరిధిలో అమలు చేస్తూ రిజిస్ట్రేషన్ల శాఖ ఉత్తర్వులు

పన్నుల వసూళ్లకు మంచిదే.. రిజిస్ట్రేషన్లకు మాత్రం ఇబ్బంది

సాధారణంగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చాకే ప్లాట్లకు పన్ను

నిర్మాణ దశలోనే ప్లాట్ల అమ్మకం, రిజిస్ట్రేషన్ ఎలా..?



ప్రజా దీవెన, హైదరాబాద్ : 'హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)' పరిధిలో ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయాలంటే ఆస్తి పన్ను మదింపు తప్పనిసరి కానుంది. ఆస్తి పన్ను గుర్తింపు నంబరు (పీటీఐఎన్)/ఖాళీ స్థలాల పన్ను గుర్తింపు నంబరు (వీఎల్‌టీఐఎన్) ఉంటేనే ఇకపై రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. సబ్‌రిజిస్ట్రార్లు ఏదైనా ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసేప్పుడు మూడు అంశాలను చూడాలని ప్రభుత్వం తాజాగా పేర్కొంది. రిజిస్ట్రేషన్‌తోపాటు మ్యుటేషన్ కూడా జరిగేలా చూడటం, ఆస్తి పన్ను గుర్తింపు నంబరు ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయడం. మొదటి రెండూ ఇప్పటికే ఉన్నవేకాగా, మూడో అంశం కొత్తగా చేర్చారు. ఈ మేరకు స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ బుధవారం ఒక మెమో జారీచేశారు. దీని ప్రకారం ఇకపై ఎవరైనా ఒక ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే... స్లాట్ బుక్ చేసే సమయంలోనే పీటీఐఎన్ నంబరును తప్పనిసరిగా నమోదు చేయాలి. లేకుంటే స్లాట్ బుక్ చేయడం కుదరదు. పీటీఐఎన్ నంబరు ఉండి, పన్ను బకాయిలు ఉంటే.. స్లాట్ బుక్ అవుతుంది. ఆస్తి పన్ను వివరాలతో దరఖాస్తుదారుకు, మున్సిపల్ అధికారులకు ఎస్సెమ్మెస్‌లు వస్తాయి. ఇది అలర్ట్ మాత్రమేనని, దానివల్ల రిజిస్ట్రేషన్ ఆపబోరని, ప్రక్రియ పూర్తి చేసేస్తారని అధికార వర్గాలు తెలిపాయి. అయితే సదరు బకాయిల వసూళ్లకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపడతారని వెల్లడించాయి.

పీటీఐఎన్ నంబరు లేకపోతే..?

ఆస్తిపన్ను మదింపు నంబరు లేకుంటే.. రిజిస్ట్రేషన్ దరఖాస్తుదారులకు రెండు అవకాశాలు ఉన్నాయి. ఒకటి 48 గంటల తర్వాత స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ఆ సమయంలోగా మున్సిపల్ అధికారులు పన్ను మదింపు చేసి నంబరు ఇవ్వాలి. అధికారులు మదింపు చేసి నిర్ణయించిన మేరకు దరఖాస్తుదారు పన్ను మొత్తం చెల్లించాలి. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ జరిగిపోతుంది. డాక్యుమెంట్‌ను వెంటనే అందజేస్తారు. ఇక రెండోది పెండింగ్ రిజిస్ట్రేషన్. అంటే వెంటనే రిజిస్ట్రేషన్ కావాలనుకున్న వారికి ప్రక్రియను పూర్తిచేస్తారు. కానీ డాక్యుమెంటును పెండింగ్‌లో పెడతారు. పన్ను మదింపు నంబరు తెచ్చుకుని, పన్ను మొత్తం చెల్లించాక.. సాధారణ రిజిస్ట్రేషన్‌గా పరిగణించి డాక్యుమెంట్‌ను విడుదల చేస్తారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే వారి పేరు కార్పొరేషన్, పట్టణాభివృద్ధి సంస్థల రికార్డుల్లో ఆటోమేటిగ్గా అప్‌డేట్ అవుతుంది. మ్యుటేషన్ సర్టిఫికెట్ కూడా వస్తుంది. ఇందుకోసం ప్రత్యేకంగా మున్సిపల్ అధికారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

నిర్మాణంలో ఉన్న, ఇప్పుడే పూర్తయిన అపార్ట్‌మెంట్ల పరిస్థితేమిటి?

కొత్త నిబంధనతో నిర్మాణ దశలోని అపార్ట్‌మెంట్ల రిజిస్ట్రేషన్ల సంగతేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉదాహరణకు ఒక బిల్డర్ 20 ఫ్లాట్లతో అపార్ట్‌మెంట్ కడుతున్నారు. అందులో మున్సిపాలిటీకి మార్టిగేజ్ పెట్టినవి తప్ప మిగతావాటిని నిర్మాణ దశలోనే విక్రయించవచ్చు. రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. కానీ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ పూర్తయ్యాక మాత్రమే పన్ను మదింపునకు వెళ్తారు. అప్పటినుంచే పన్ను కడతారు. కానీ ఇప్పుడు పీటీఐఎన్ నంబరు తప్పనిసరి చేయడంతో నిర్మాణ దశలో అమ్మకం, రిజిస్ట్రేషన్ల సంగతేమిటనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పుడిప్పుడే నిర్మాణం పూర్తిచేసుకున్న అపార్ట్‌మెంట్లకు కూడా పన్ను మదింపు కావడానికి సమయం పడుతుందని.. అప్పటివరకు రిజిస్ట్రేషన్లు ఆగిపోతాయా? అన్న ప్రశ్న కూడా వస్తోంది. ఇక అసెస్‌మెంట్ నంబరు లేని వారికి... రెండు రోజుల్లో అసెస్‌మెంట్ నంబరు తీసుకుంటే రిజిస్ట్రేషన్ అవుతుందని రిజిస్ట్రేషన్ల శాఖ మెమోలో పేర్కొంది. ఒకవేళ రెండురోజుల్లో మున్సిపల్ సిబ్బంది అసెస్‌మెంట్ చేయకపోతే ఎలాగన్న స్పష్టత లేదు. కొత్త విధానం పన్నుల వసూళ్లకు మంచిదే అయినా.. రిజిస్ట్రేషన్లకు ఇబ్బందికరంగా మారుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సమగ్ర భూ రీసర్వేను నిరంతరం పర్యవేక్షించాలి

కలెక్టర్లకు సూచించిన మంత్రి పొంగులేటి

ప్రజా దీవెన, హైదరాబాద్ : సమగ్ర భూ రీసర్వేను జిల్లా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పించాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. రీసర్వే పూర్తయిన తర్వాత ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని తెలియజేసేందుకు కల్పిస్తున్న అవకాశాలను రైతులకు వివరించాలన్నారు. నోటీసులు జారీ చేసిన అనంతరం ప్రతి 15 రోజులకు ఒకసారి సంబంధిత గ్రామాల్లో చాటింపు నిర్వహించాలని, కలెక్టర్లు తప్పనిసరిగా ఆయా గ్రామాల్లో పర్యటించి రైతుల సందేహాలను నివృత్తి చేయాలని స్పష్టం చేశారు. పాలేరు నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని, నియోజకవర్గ పరిధిలోని మొత్తం 141 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రీసర్వే నిర్వహణకు ప్రభుత్వం ఇప్పటికే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్ఓపీ) జారీ చేసిందని మంత్రి పొంగులేటి తెలిపారు. క్షేత్రస్థాయి అధికారుల సూచనలతో ఎస్ఓపీలో అవసరమైన మార్పులు చేస్తామని చేసి మరింత స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తామన్నారు. రెవెన్యూ, ఫారెస్ట్ భూముల సరిహద్దుల విషయంలో గందరగోళానికి తావులేకుండా అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. 22-ఎ భూములకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు.

ముస్లిం రిజర్వేషన్లను తొలగించేవాడు ఇంకా పుట్టలేదు

దమ్ముంటే గుజరాత్‌లో రద్దు చేసి చూపించాలి

తెలంగాణ గల్లీ కారు ఢిల్లీ చేరగానే మోదీ కమలంగా మారిపోతోంది

మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో రేవంత్‌రెడ్డి



ప్రజా దీవెన, హైదరాబాద్ : తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్య, ఉద్యోగాల్లో లక్షలాది మంది ముస్లింలు లబ్ధి పొందుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ముస్లింల వెనుకబాటుతనాన్ని గుర్తించి ఎన్నో సంవత్సరాలు కష్టపడి పార్టీ తెచ్చిన రిజర్వేషన్ అని, దీన్ని తొలగించేవాడు ఇంకా పుట్టలేదన్నారు. 'రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తామని బీజేపీ నేతలు అంటున్నారు. వారు ముందుగా గుజరాత్‌లో అమలవుతున్న ముస్లిం రిజర్వేషన్లను తొలగించి చూపాల'ని సీఎం సవాల్ విసిరారు. ఢిల్లీ నుంచి మోదీ, అమిత్ షా ఇక్కడికి బాటసారులుగా వస్తుంటారు.. పోతుంటారని, ఇక్కడ రిజర్వేషన్లు మాత్రం ఎప్పటికీ కొనసాగుతాయన్నారు. తెలంగాణ గల్లీ నుంచి వెళ్లిన కారు ఢిల్లీ చేరగానే మోదీ కమలంగా మారిపోతోందని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి సీఎం విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతీ ప్రజావ్యతిరేక నిర్ణయానికి బీఆర్ఎస్ మద్దతు ఇస్తోందన్నారు. భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని మైనారిటీ శాఖ బంజారా భవన్‌లో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో సీఎం పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ దేశ జనాభాలో 15 శాతం ఉన్న మైనారిటీ వర్గాలు కూడా ప్రగతి సాధించినప్పుడే దేశం ముందడుగు వేస్తుందన్నారు. మైనారిటీల్లో పేదరికం తొలగించాలన్న ఉద్దేశంతో సచార్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా 4 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు చెప్పారు. మారుతున్న పరిస్థితుల్లో విద్య ఒక్కటే సరిపోదని, ప్రపంచవ్యాప్తంగా స్కిల్స్ ఉన్నవారికే ప్రాధాన్యం దక్కుతోందన్నారు. మైనారిటీ యువకుల్లో స్కిల్స్ ఉన్నవారు చాలామంది ఉన్నారన్నారు. పిల్లలను బాగా చదివించాలని, చదువుల పట్ల మక్కువ లేని వారికి స్కిల్స్ నేర్పించాలని లేదా క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. క్రికెటర్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్ అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పేరు తెచ్చారన్నారు. వారిని ప్రభుత్వం గ్రూప్-1 ఆఫీసర్లుగా నియమించి ప్రోత్సహించిందన్నారు.

నైట్ ఎకానమీతో ఉపాధి అవకాశాలు

మూసీ రివర్ ఫ్రంట్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని సీఎం తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ పరిసరాల్లో నైట్ ఎకానమీని అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో విస్తరణ పనులను వచ్చే రెండు నెలల్లో ప్రారంభం కానున్నాయని తెలిపారు. మీరాలం ట్యాంక్ మరో ఏడాదిలో సుందరమైన ప్రదేశంగా రూపుదిద్దుకోబోతోందని చెప్పారు. 'ఓల్డ్ సిటీ కాదు... ఒరిజినల్ సిటీని తిరిగి పునరుద్ధరించడం కోసం అడుగులు వేశామ'ని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వీ హనుమంతరావు, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రంగనాథ్‌ను రప్పించాల్సిందే

ఓ కోర్టు ధిక్కరణ కేసులో డీజీపీకి హైకోర్టు ఆదేశాలు

ప్రజా దీవెన, హైదరాబాద్ : ఓ కోర్టు ధిక్కరణ కేసులో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను తమ ఎదుట హాజరుపరిచేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీకి హైకోర్టు సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే కేసులో శంషాబాద్ తహసీల్దార్ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీసులను ఆదేశించింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ ఈ ఇద్దరు అధికారులు దాఖలు చేసిన దరఖాస్తులను జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం బుధవారం కొట్టేసింది. మినహాయింపు కోసం వారు చెప్పిన కారణాలు ఏమాత్రం సంతృప్తికరంగా లేవని పేర్కొంది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 626/2ఏఏలో తమ భూమిలో ఉన్న నిర్మాణాలను కూల్చేసి, ఆ భూమిని బలవంతంగా లాక్కున్నారని పేర్కొంటూ హైదరాబాద్ జహనుమా ప్రాంతానికి చెందిన తాజమలుద్దీన్ అలియాస్ మొయినుద్దీన్‌ఖాన్ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సదరు భూమిని రిజిస్ట్రేషన్ యాక్ట్-1908 సెక్షన్ 22ఏ (నిషేధిత జాబితా) నుంచి తొలగించాలని పేర్కొంటూ రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకునేందుకు హైకోర్టు తనకు గతంలో అవకాశం ఇచ్చిందని తెలిపారు. ఆ దరఖాస్తును, టైటిల్ పత్రాలను, ఆధారాలను పరిశీలించి తగిన వివరణతో ఉత్తర్వులు జారీచేయాలని రెవెన్యూ అధికారులను ధర్మాసనం ఆదేశించిందని గుర్తు చేశారు. ఈ మేరకు 2024లో హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను హైడ్రా కమిషనర్, తహసీల్దార్ ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని.. అక్కడ ఉన్న నిర్మాణాలను, కంచెను కూల్చేశారని తెలియజేశారు. ఎలాంటి నోటీసులు కూడా జారీ చేయకుండా, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఆ భూమిని ప్రభుత్వ భూమిగా ప్రకటించారన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. వ్యక్తిగతంగా హాజరుకావాలని పేర్కొంటూ గత విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్, శంషాబాద్ తహసీల్దార్‌లకు ఫారం-1 నోటీసు జారీచేసినా వారు నిర్లక్ష్యం చేయడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఆ ఇద్దరు అధికారులు ఈ నెల 17న వ్యక్తిగతంగా తమ ఎదుట హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డీజీపీ, సైబరాబాద్ పోలీసులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

ఇప్పటికే పలుమార్లు మినహాయింపు

మరో కోర్టు ధిక్కరణ కేసులో మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టర్ మను చౌదరి వ్యక్తిగతంగా తమ ఎదుట హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌కు జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ భూసంస్కరణల చట్టం-1973 ప్రకారం తన భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవడాన్ని సవాల్ చేస్తూ కోడూరి అర్జున రావు అనే వ్యక్తి గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి 2025 జూలై 8న మధ్యంతర ఆదేశాలు వెలువరిస్తూ.. వివాదాస్పద భూముల్లో ఎలాంటి భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరాదని, పిటిషనర్ విజ్ఞప్తిని పరిశీలించి తగిన ఉత్తర్వులు ఇవ్వాలని పేర్కొంది. అయితే, అధికారులు కోర్టు ఆదేశాలను పట్టించుకోలేదని తెలియజేస్తూ పిటిషనర్ మళ్లీ కోర్టును ఆశ్రయించారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం.. భూసంస్కరణల ట్రిబ్యునల్ అయిన ఆర్డీవోను తీసుకుని వ్యక్తిగతంగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసినప్పటికీ నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే చాలాసార్లు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు తీసుకున్నారని గుర్తు చేసింది. తాజాగా కలెక్టర్ దాఖలు చేసిన మినహాయింపు అప్లికేషన్‌ను డిస్మిస్ చేసింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టర్ తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈనెల 25వ తేదీకి వాయిదాపడింది.

సబ్సిడీల సంబురం

రబీ సీజన్‌లో వాడే యూరియాయేతర ఎరువులకు రూ.3,230 కోట్లతో ఢిల్లీలో యుగే యుగీన్ భారత్ మ్యూజియం ఏర్పాటు

సూక్ష్మ పరిశ్రమలకు 'ముద్ర' క్రెడిట్ గ్యారెంటీ మరో ఐదేళ్లు

కేంద్ర మంత్రిమండలి నిర్ణయాలు



న్యూఢిల్లీ : ప్రస్తుత రబీ సీజన్‌లో ఎరువుల సబ్సిడీకి కేంద్ర ప్రభుత్వం రూ.62,370 కోట్లు కేటాయించింది. 2026 అక్టోబరు నుంచి 2027 మార్చి మధ్య కాలంలో దేశవ్యాప్తంగా రైతులు పంటల్లో వాడే ఫాస్ఫాటిక్, పొటాషిక్(పీకే) ఎరువులకు న్యూట్రియెంట్స్ బేస్డ్ సబ్సిడీ(ఎన్‌బీఎస్) రేట్ల కింద ఈ సబ్సిడీని అందజేస్తారు. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో ఎరువుల సబ్సిడీతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటి మొత్తం బడ్జెట్ రూ.77,101 కోట్లు. క్యాబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఎన్‌బీఎస పథకం కింద నైట్రోజన్, ఫాస్పరస్, పొటాష్, సల్ఫర్ (ఎన్‌పీకేఎస్) ఎరువులతోపాటు డీఏపీకి ప్రభుత్వం ప్రత్యేక సబ్సిడీ ఇస్తోంది. ప్రస్తుత రబీ సీజన్‌లో నైట్రోజన్ ఎరువులకు కిలోకు రూ.94.21 సబ్సిడీ నిర్ణయించారు. ఫాస్పరస్ ఎరువులకు కిలోకు రూ.66.11, సల్ఫర్ ఎరువులకు కిలోకు రూ.10.42 సబ్సిడీ ఇవ్వనున్నారు. పొటాష్ ఎరువులకు గతంతో పోల్చితే ఏమార్పూ లేకుండా కిలోకు రూ.2.38 ఖరారు చేశారు. అమెరికా-ఇరాన్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాల వల్ల ఎరువుల ముడిపదార్థాలకు కొరత ఏర్పడినప్పటికీ.. ఆ ప్రభావం రైతులపై పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. డీఏపీ 50 కిలోల బస్తా ధరను రూ.1,350 వద్దే కొనసాగిస్తున్నట్లు చెప్పారు. 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీకి కేంద్రం రూ.1,70,977 కోట్లు కేటాయించింది. ఇందులో యూరియా సబ్సిడీకి అత్యధికంగా రూ.1.16 లక్షల కోట్లు ఇవ్వగా, ఎన్‌బీఎస్ పథకానికి రూ.54,000 కోట్లు కేటాయించారు. అయితే, గత ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్లలో కలిపి ఎన్‌బీఎస్ పథకానికి సబ్సిడీ రూ.1,03,903 కోట్లకు చేరింది. ఈ నెల 10వేదీ నాటికి దేశంలో యూరియా నిల్వలు 103.12 లక్షల టన్నులు, డీఏపీ నిల్వలు 28.65 లక్షల టన్నులు ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో ఏ ఎరువులకూ కొరత లేదని తెలిపారు.

మరో ఐదేళ్లపాటు ముద్రా యోజన

ప్రధానమంత్రి ముద్రా యోజన (పీఎంఎంవై) పథకం కింద సూక్ష్మ పరిశ్రమలకు క్రెడిట్ గ్యారంటీని మరో ఐదేళ్లపాటు కొనసాగించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి క్రెడిట్ గ్యారంటీ ఫండ్ ఫర్ మైక్రో యూనిట్స్ (సీజీఎఫ్ఎంయూ) పథకాన్ని 2031 మార్చి వరకు పొడిగించేందుకు ఆమోదం తెలిపిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ముద్రా యోజన లోన్ల కోసం రూ.5,000 కోట్ల కార్పస్ ఫండ్ ఇవ్వటానికి ఆమోదం తెలిపింది. సీజీఎఫ్ఎంయూ ద్వారా ఈ ఏడాది సెప్టెంబరు నాటికి సూక్ష్మ పరిశ్రమలకు రూ.43.34 లక్షల కోట్ల విలువైన 60.36 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. వచ్చే ఐదేళ్లలో మరో రూ.12.6 లక్షల కోట్ల విలువైన గ్యారంటీ లేని (కొల్లేటరల్ ఫ్రీ) రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రారంభించిన స్టాండప్ ఇండియా పథకాన్ని కూడా 2031 మార్చి 31 వరకు పొడిగించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఈ పథకం కింద మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రూ.10 లక్షల నుంచి రూ.1 కోటి వరకు రుణాలు ఇప్పిస్తారు.

ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజియం యుగే యుగీన్..

భారతదేశ 5 వేల ఏళ్ల చరిత్రను భవిష్యత్ తరాలకు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించేలా ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజియంను ఏర్పాటు చేసేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీలోని నార్త్, సౌత్ బ్లాక్ కాంప్లెక్స్‌లో యుగే యుగీన్ భారత్ మ్యూజియం పేరుతో దీనిని ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం రూ.3,230 కోట్లను క్యాబినెట్ కేటాయించారు. ఈ మ్యూజియం 1,78,509 చదరపు మీటర్ల వైశాల్యంలో ఉంటుంది. ఈ మ్యూజియంను 2030-31 ఆర్థిక సంవత్సరం నాటికి దశలవారీగా ఏర్పాటు చేస్తారు. మొదటి గ్యాలరీ వచ్చే ఏడాది చివరికల్లా అందుబాటులోకి రావొచ్చు. కాగా, నోయిడాను గ్రేటర్ నోయిడాతో అనుసంధానించేందుకు ఉద్దేశించిన మెట్రో రైల్ కారిడార్ విస్తరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 8.449 కిలోమీటర్ల పొడవైన ఈ ఎలివేటెడ్ కారిడార్‌కు రూ.2,390 కోట్లు కేటాయించింది.

30 నుంచి పార్లమెంట్!

మహిళా రిజర్వేషన్, పునర్విభజన బిల్లుల ఆమోదం కోసం మోదీ సర్కారు వ్యూహాలు

25, 26 తేదీల్లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ?

న్యూఢిల్లీ, నవంబర్ 11 : మోదీ ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ నుంచి పార్లమెంటు సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఆ సమావేశాలకు ఐదారు రోజుల ముందు అంటే ఈ నెల 25 లేదా 26న కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని ప్రధాని మోదీ భావిస్తున్నట్టు సమాచారం. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రోరోగ్ కాకపోవడంతో ఈ నెలాఖరులో జరిగే సమావేశాలు వర్షాకాల సమావేశాలుగానే కొనసాగుతాయని... ప్రత్యేకంగా శీతాకాల సమావేశాలు ఉండవని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 30 నుంచి డిసెంబర్ 18 వరకు పార్లమెంటు సమావేశాలు జరిగే అవకాశం ఉందని అంటున్నాయి. ఈసారి పార్లమెంటు సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లును ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదింపచేసేందుకు మోదీ సర్కార్ రంగం సిద్ధం చేసుకుంటోంది. వివిధ పార్టీలతో బీజేపీ సీనియర్లు అంతరంగిక చర్చలు ఇప్పటికే పూర్తిచేసినట్టు సమాచారం. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీతోపాటు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) కూడా నియోజకవర్గాల పెంపునకు సుముఖంగా ఉన్నాయని.. డీఎంకే కూడా కొన్ని షరతులతో సుముఖత వ్యక్తం చేసిందని చెబుతున్నారు.

మంత్రివర్గంలో భారీగానే మార్పులు

ఈసారి మంత్రివర్గంలో భారీగానే మార్పులు చేయాలని మోదీ సర్కారు భావిస్తున్నట్టు సమాచారం. 12 నుంచి 17 మంది కొత్తవారిని తీసుకోవాలని, కొందరు సీనియర్లను తప్పించాలని నిర్ణయించినట్టు తెలిసింది. అమిత్ షా, జేపీ నడ్డా, శివరాజ్ చౌహాన్, నిర్మల, మనోహర్‌లాల్, ప్రహ్లాద్ జోషి, అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి తదితరులు ఒకటి కంటే ఎక్కువ శాఖలు నిర్వహిస్తున్నారు. ఆ అదనపు శాఖలను కొత్తవారికి కేటాయించే అవకాశాలు ఉన్నాయి.

న్యాయంకోసం యువతరం తపన

మోదీ సర్కారు కాళ్ల కింద నేల కదిలింది

న్యాయం కోసం నవతరం తపిస్తోంది

యువత మన దేశ ఆత్మను తిరిగి సాధిస్తారు

తన ఆత్మకథలో సోనియా

పప్పు, అన్నం లేనిదే రోజు గడవదని 'ఎక్స్'లో పోస్ట్



న్యూఢిల్లీ : తమకు ప్రజాదరణ తగ్గలేదని మోదీ సర్కారు ఎంతగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ.. ప్రభుత్వం కాళ్ల కింద నేల ఇప్పటికే కదిలిందని, ఈ పాలన శాశ్వతం కాదని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అభిప్రాయపడ్డారు. ఇటీవలికాలంలో మోదీ సర్కారు తీసుకుంటున్న చర్యలు.. ప్రభుత్వ అభద్రతాభావాన్ని సూచిస్తున్నాయని ఆమె తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'లో పేర్కొన్నారు. న్యాయం కోసం, అణచివేత వ్యవస్థలను తొలగించడం కోసం, అన్యాయాన్ని తొలగించడం కోసం నవతరం పరితపిస్తున్నట్లు తాను గ్రహించానని తెలిపారు. "అందుకు సమయం పట్టొచ్చు. కానీ.. కాలం మారుతుంది. యువత తాము అనుకున్నది సాధించడంలో విజయవంతమవుతుంది. వారు మన దేశ ఆత్మను తిరిగి సాధిస్తారు. దాని గాయాలను మాన్పుతారు" అని పేర్కొన్నారు. అలాగే.. ధరల పెరుగుదల, నిరుద్యోగం, కోరలు సాచిన అవినీతి వంటి విషయాలపై స్పందించేందుకు ప్రజలు గతంతో పోలిస్తే చాలా తక్కువగా భయపడుతున్నారని సోనియా అభిప్రాయపడ్డారు. నిరంకుశ ప్రభుత్వాలు ప్రజా ప్రతిఘటనలను మరింత బలంగా అణచివేసేందుకు ప్రయత్నిస్తాయని.. ప్రస్తుతం భారత్‌లో జరుగుతున్నది అదేనని ఆమె పేర్కొన్నారు. "కానీ ఈ పాలన శాశ్వతం కాదు. అధికార దుర్వినియోగం తప్పనిసరి పర్యవసానాలకు దారి తీసి పతనానికి కారణమవుతుంది. ప్రపంచమంతా వ్యాపించిన అత్యంత శక్తిమంతమైన బ్రిటిష్ సామ్రాజ్యం ఒక సుదూర అవశేషంగా మిగులుతుందని ఒక శతాబ్దం క్రితం ఎవరూ ఊహించి ఉండరు. కేవలం ఒక కొల్లాయి గుడ్డ ధరించిన బక్కపల్చటి మనిషి కోట్లాది మంది భారతీయులను ఒక్కటిగా చేసి ఆ మహాశక్తిని ఓడిస్తారని కూడా ఎవరూ ఊహించి ఉండరు" అని సోనియా తన ఆత్మకథలో రాశారు. భారతదేశ వైవిధ్యంపై, బహుళత్వంపై ఒక మతాన్ని, ఒక భాషను రుద్దాలనే ఆరెస్సెస్ దీర్ఘకాలిక ఆధిపత్య పథకాన్ని ప్రజలు గట్టిగా ప్రతిఘటిస్తారనడంలో తనకు ఎలాంటి సందేహమూ లేదని ఆమె స్పష్టం చేశారు. అలాగే.. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి నేపథ్యంలో రాహుల్ గాంధీ ఏడో పుట్టినరోజు వేడుకలకు అతడి బెస్ట్ ఫ్రెండ్ సిద్ధార్థ్ ఒక్కడే వచ్చాడని. మిగతావారెవ్వరూ రాలేదని.. ఏడేళ్ల చిన్నారికి స్నేహితులతో ఉన్న బంధం రాజకీయాల వల్ల కలుషితం కావడం పట్ల తామెంతో బాధపడ్డామని సోనియా వాపోయారు. ఒకసారి రాహుల్, ప్రియాంక బడి నుంచి ఇంటికి వస్తూనే.. 'అమ్మా.. నాన్నను, నాయనమ్మను దొంగలని.. వారు జైలుకు వెళ్తారని.. అంతా ఎందుకంటున్నారు? వారేమైనా తప్పు చేశారా?' అని ప్రశ్నించారని.. అదంతా నిజం కాదని వారిని తాను సముదాయించానని తెలిపారు.

పప్పు లేకుండా ఒక్కరోజు కూడా గడవదు

ఒకప్పుడు మంచి ఆహారం కోసం వెతికే క్రమంలోనే తాను రాజీవ్‌ను కలిసి, ప్రేమలో పడ్డానని పేర్కొన్న సోనియా.. ఇప్పుడు పప్పు, అన్నం తన ఇంటి రుచిగా మారిపోయిందని.. అది లేకుండా తనకు ఒక్కరోజు కూడా గడవదని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రియాంక గాంధీ వాద్రా, ఆమె కుమార్తె మిరాయాతో కలిసి దీపావళికి ముందు తీసుకున్న వీడియోను ఆమె పోస్ట్ చేశారు.

పాల ధరల దరువు

లీటరుకు రూ.2 నుంచి రూ.6 వరకు భారం

ఈ రోజు నుంచే అమల్లోకి..

న్యూఢిల్లీ : కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు కొండెక్కి సామాన్యుడు ఇప్పటికే సతమతమవుతుండగా.. ఇప్పుడు పాల ధరల బాదుడుతో మరో షాక్ తగలబోతోంది. ప్రముఖ డెయిరీ దిగ్గజాలు అమూల్, మదర్ డెయిరీ వినియోగదారులపై ధరల భారాన్ని మోపాయి. పాల రకాన్ని బట్టి లీటరుకు రూ. 2నుంచి ఏకంగా రూ. 6వరకు పెంచుతున్నట్లు ప్రకటించాయి. పెరిగిన ధరలు గురువారం నుంచే అమల్లోకి రానున్నాయి. సాధారణంగా శీతాకాలంలో పాల ఉత్పత్తి పెరిగి ధరలు స్థిరంగా ఉంటాయని, కానీ ఈసారి సరఫరా లేమి కారణంగా పాలలోని కొవ్వు(మిల్క్ ఫ్యాట్) ధరలు గడిచిన కొద్ది నెలల్లోనే 20 నుంచి 25శాతానికి పెరిగాయని కంపెనీలు తెలిపాయి. లోటు వర్షపాతం, పాల లభ్యత తగ్గిపోవడంతో పాటు పశువుల మేత, రైతుల వద్ద నుంచి పాల సేకరణ ధరలు గణనీయంగా పెరిగాయని, దాంతో పెరిగిన నిర్వహణ వ్యయంలో కొంతభాగాన్ని వినియోగదారులపై మోపక తప్పడం లేదని స్పష్టం చేశాయి. కాగా, ఈ రెండు సంస్థలు ఏడాదిలో పాల ధరలను పెంచడం ఇది రెండోసారి కావడం గమనార్హం. చివరగా గత మే నెలలో సవరించాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో పెరిగిన పాల ధరలను పరిశీలిస్తే.. అమూల్ సంస్థ తమ పాల ధరలను లీటరుకు రూ. 2 నుంచి గరిష్ఠంగా రూ. 4వరకు పెంచింది. ఎక్కువగా అమ్ముడయ్యే అమూల్ 'తాజా' లీటరుపై రూ.2 పెరగగా, అమూల్ 'గోల్డ్' రూ.4 చొప్పున పెరిగాయి. మదర్ డెయిరీ విక్రయించే 6.5శాతం వెన్న ఉన్న గేదె పాలు లీటరుపై ఏకంగా రూ.6కు పెంచడంతో రూ. 80 నుంచి రూ. 86కు చేరింది. టోన్డ్ పాలు లీటరుకు రూ. 58 నుంచి రూ. 60కి, ఫుల్‌క్రీం పాలు రూ. 72 నుంచి రూ. 76కు చేరుకున్నాయి.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

ప్రభుత్వ ఉన్నత ఉద్యోగానికి రాజీనామా

పట్టభద్రు ల ఎమ్మెల్సీ బరిలోకి యార్కల శ్రీనివాస్ గౌడ్

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ప్రధాన లక్ష్యం పట్టభద్రుల సమస్యలపై పోరా టానికి సిద్ధం

పట్టభద్రుల గొంతుకగా మండలి లో అడుగుపెట్టడమే ఆశయమ న్న శ్రీనివాస్



ప్రజా దీవెన, నల్లగొండ: ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాన్ని వదులుకొని ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయ రం గంలోకి అడుగుపెట్టేందుకు య ర్కల శ్రీనివాస్ గౌడ్ సిద్ధమయ్యా రు. అటవీ శాఖలో ఉన్నత స్థా యి ప్రభుత్వ ఉద్యోగానికి రాజీ నామా చేసి, రాబోయే నల్లగొండ --ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయ నున్నట్లు ప్రకటించారు. ఆయన నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఆస క్తికర చర్చకు దారితీసింది. ఉద్యోగ భద్రతతో కూడిన ప్రభు త్వ పదవిని వదులుకొని ప్రజా స మస్యల పరిష్కారం కోసం ప్రజా క్షేత్రంలోకి రావడం తనకు ఎంతో సంతృప్తినిస్తోందని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఉద్యో గాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టభద్రులు ఎదుర్కొంటున్న స మస్యలు, నిరుద్యోగం, ఉద్యోగ భద్రత, విద్యావ్యవస్థలో మార్పు లు, యువత భవిష్యత్తుకు సం బంధించిన అంశాలపై శాసనమం డలిలో గళం విప్పుతానని తెలి పారు. అర్హత ఉన్న యువతకు తగిన అవకాశాలు కల్పించే దిశ గా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తా నని వెల్లడించారు. ఏ రాజకీయ పార్టీకి అనుబంధం గా కాకుండా స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలవాలని ని ర్ణయించుకున్నట్లు ప్రకటించారు. రాజకీయాలకు అతీతంగా పట్ట భద్రుల సమస్యలను ప్రాధాన్యం గా తీసుకొని, వారి ఆశలు, ఆ కాంక్షలకు ప్రతినిధిగా నిలవడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

పట్టభద్రుల హక్కుల కోసం మరో గొంతుక

నల్లగొండ–ఖమ్మం–వరంగల్ ప ట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో య ర్కల శ్రీనివాస్ గౌడ్ ప్రవేశం ఎ లాంటి రాజకీయ సమీకరణా ల కు దారితీస్తుందో, పట్టభద్రుల నుంచి ఆయనకు ఎలాంటి స్పం దన లభిస్తుందో వేచి చూడాలని రాజకీయ పరిశీలకులు భావిస్తు న్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకవచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలి



శాలిగౌరారం : రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుక వచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని డి ఆర్ డి ఓ పీడీ శేఖర్ రెడ్డి అన్నారు. శాలిగౌరారం మండలం భైరవునిబండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు సంచాలకులు వై. శేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ “ఈ సంవత్సరం ప్రభుత్వం మద్దతు ధరను పెంచిందని ఏ గ్రేడు ధాన్యానికి క్వింటాలుకు 2,461 రూపాయలు, సాధారణ రకం ధాన్యానికి క్వింటాలుకు 2,441 రూపాయలు చెల్లిస్తాం. రైతులు ధాన్యాన్ని బాగా తూర్పారబట్టి తేమ శాతం 17 లోపు ఉండేలా శుభ్రం చేసి తీసుకురావాలి. వరుస సంఖ్య విధానాన్ని పాటించాలి. ధాన్యం కొనుగోలు పారదర్శకంగా జరగాలి” అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరిగె యాదయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరిగే నరసింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింత ధనుంజయ్, ఉప సర్పంచ్ దండ శ్రీలత కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ నరిగే శంభయ్య,ఏపి ఎం శంకరయ్య,ఉపాధి హామీ ఏ పి ఓ జంగమ్మ, మండల సమైక్య అధ్యక్షురాలు మోదుగు అండాలు,గ్రామ సమాఖ్య ప్రతినిధి దాసరి శాంత, ఏపిఎం పోలేపల్లి శంకర్,దేవస్థానం చైర్మన్ దండ యాదగిరిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చిత్తలూరులో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నూతన శాఖ ప్రారంబించిన చైర్మన్ ప్రతాప్ రెడ్డి



శాలిగౌరారం : గ్రామీణ ప్రాంత ప్రజలు తెలంగాణ గ్రామీణ బ్యాంకును వినియోగించుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రాష్ట్ర చైర్మన్ ప్రతాప్ రెడ్డి అన్నారు.శాలిగౌరారం మండల చిత్తలూరు గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నూతన శాఖను బుధవారం చైర్మెన్ ప్రతాపరెడ్డి ప్రారం భించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలను అందించడంతో పాటు, రైతులకు, ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ చేయడమేలక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ గిరగాని వెంకన్న,మాజీ సర్పంచ్ బొమ్మగాని రవి,రీజనల్ మేనేజెర్ కె.శివ కుమార్,అడ్వాన్స్ మేనేజర్ కరుణాకర్ రెడ్డి,సీనియర్ మేనేజర్ సిహెచ్ వెంకటేష్,బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ అలుగుబెల్లి అజయ్,క్యాషియర్ తాళ్లపల్లి రవికుమార్,జబ్బార్, సభ్యురాలు పీర్నాయకం సునీత,పీర్నాయకం రమేష్,దాసరి దేవ చిత్తం,ఎర్ర రాజు, బ్యాంకు సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పురాతన, చారిత్రా త్మక కట్టడాలు, దేవాలయాల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదీ

నల్లగొండ కలెక్టర్ చంద్రశేఖర్ కీలక అప్పీల్



ప్రజా దీవెన, నల్లగొండ: పురాత న, చారిత్రాత్మక కట్టడాలు, దేవా లయాలను సంరక్షించు కోవాల్సి న బాధ్యత అందరిపై ఉందని జి ల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నా రు. బుధవారం ఇంటాక్ (ఇండి యన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అం డ్ కల్చర్ ఫర్ హెరిటేజ్) తెలం గా ణ చాప్టర్ ఆధ్వర్యంలో నల్గొండ సమీపంలోని పానగల్ లో ఉన్న ఛాయా సోమేశ్వర స్వామి దేవా లయం వద్ద నిర్వహించిన “వార సత్వ నడక”(హెరిటే జ్ వాక్) ను జిల్లా కలెక్టర్ జండా ఊపి ప్రా రంభించారు.ఈ సందర్భంగా ఆ యన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని, రాష్ట్రం నలుమూల ల నుండి ఈ దేవాలయాన్ని సం దర్శించేందుకు ప్రజలు వస్తుంటా రని, ముఖ్యంగా 12వ శతాబ్దం లో కాకతీయుల కాలంలో ఈ దే వాలయం ఏర్పా టైనట్లు చరిత్ర ద్వారా తెలుస్తున్నదని చెప్పారు. హెరిటేజ్ వాక్ ద్వారా ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం గురించి మరింత తెలుసుకునే అ వకాశం ఉందని ఉన్నారు. ఇ లాంటి పురాతన కట్టడాలు, చారి త్రక నిర్మాణాలను సంరక్షించుకో వాల్సిన అవసరం ఉందని , ఇం దులో భాగంగానే రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇ టీవల ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి బడ్జెట్ ను కేటాయించిన విషయాన్ని ఆయ న గుర్తు చేశారు. ఇంటాక్ సంస్థ ద్వారా ఛాయా సోమేశ్వర స్వా మి దేవాలయం వద్ద హెరిటేజ్ వాక్ ప్రారంభించడం సంతోషకర మని అన్నారు. అంతకు ముందు ఆయన ఇం టాక్ ప్రతినిధులతో కలిసి ఛా యా సోమేశ్వర స్వామి దేవాల యంలో ప్రత్యేక పూజలు నిర్వ హించడమే కాకుండా ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయ వి శిష్టతను, గర్భగుడిలో ఉన్న శివ లింగంపై ఛాయ (నీడ) ఏర్పడే వి ధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి తెలుసుకున్నారు.ఇంటాక్ న్యూ ఢిల్లీ చైర్మన్ అశోక్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ పురాతన కట్టడా లను పునరుద్ధరించడం, సంర క్షించడమే ఇంటాక్ సంస్థ ఉ ద్దేశ మని తెలిపారు.నల్గొండ ఇంటాక్ చాప్టర్ ను ప్రారంభించే నిమిత్తం నల్గొండకు వచ్చి చాయా సోమే శ్వర స్వామి దేవాలయాన్ని సం దర్శించడం ఎంతో సంతోషమని అన్నారు. ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయ పరిరక్షణకు ఇంటాక్ కృషి చేస్తుందని తెలిపా రు.ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డైరెక్టర్ అర్జున్ రావు, వెద్ కు మార్, సజ్జాద్ సాహిది, ధనుం జ య్, రమేష్ తదితరులు ఉన్నా రు.

అబుల్ కలాం ఆజాద్ పోరాట స్ఫూర్తి భావితరాలకు తెలిపాలి

నల్లగొండ: భారతరత్న భారత దేశ తొలి వి ద్యాశాఖ మంత్రి మౌ లానా అబు ల్ కలాం ఆజాద్ పో రాట స్ఫూర్తి ని, ఆలోచనా దృక్ప థాన్ని భావిత రాలకు తెలియజే యాల్సిన అవసరం ఉందని జి ల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నా రు.మౌలానా అబుల్ కలాం ఆజా ద్ 138 వ జ యంతిని పురస్క రించుకొని బు ధవారం జిల్లా కలె క్టర్ కార్యాల య సమావేశ మం దిరంలో ఏర్పా టుచేసిన మౌలా నా అబుల్ క లాం ఆజాద్ చిత్ర పటానికి పూల మాలవేసి ఆయ న ఘనంగా నివాళు లర్పించారు. స్వాతంత్ర సమరయోధుడిగా, వి ద్యావేత్తగా పేరుపొందిన మౌలా నా అబుల్ కలాం ఆజాద్, మహా త్మా గాంధీ పిలుపుమేరకు స్వా తంత్ర ఉద్యమంలో స్వదేశీ ఉద్య మం, సత్యాగ్రహ ఉద్యమం, స హాయ నిరాకరణ ఉద్యమాలలో పాల్గొని గాంధేయ మార్గంలో నడి చి జర్నలిజం ద్వారా ప్రజలను ప్ర భావితం చేశారని తెలిపారు. వా రి సేవలకు గుర్తుగా ప్రభుత్వం భారతదేశ తొలి విద్యాశాఖ మం త్రిని చేసిందని, దేశంలో మొట్ట మొదటి విద్యాపాలసిని తీసుకొ చ్చిన ఘనత ఆయనదేనని, ప్ర భుత్వం ఆయనకు 1992 లో భా రతరత్న ఇవ్వడం జరిగిందని ఆ యన వెల్లడించారు. వారి పోరా ట స్ఫూర్తి, ఆలోచనా దృక్పథాన్ని భావితరాలకు తెలియజేయాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షు లు ఆఫీజ్ ఖాన్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను కొనియాడారు. నల్గొండ డిప్యూటీ మేయర్ అమీర్ అలీ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ అసలు పేరు మో హియుద్దీన్ అహ్మద్ అని, ఆయ న విద్యా శాఖ మంత్రిగా పనిచేసి న సమయంలో యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్(యూజీసీ), ఐఐ టీలను, వివిధ రకాల అకాడమీ లను ఏర్పాటు చేశారని తెలిపా రు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా అల్పసంఖ్యాక వ ర్గాల సంక్షేమ అధికారి విజయేం దర్ రెడ్డి, కార్పొరేటర్లు, మైనార్టీ పెద్దలు, తదితరులు ఈ కార్యక్ర మంలో పాల్గొని మౌలానా అబు ల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివా ళులర్పించారు.





స్కిల్ డెవలప్మెంట్‌తో బంగారు భవిష్యత్తు





నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యా ఖ్య, మహిళలు,యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే న్యాక్ లక్ష్యం

ప్రజా దీవెన,నల్లగొండ టౌన్: యువత నైపుణ్యాలను పెంపొందిం చుకొని స్వయం ఉపాధి పొందా లని నల్గొండ మున్సిపల్ కార్పొ రేషన్ మేయర్ శ్రీమతి బుర్రి చైత న్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని నేష న ల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ (N AC) కేంద్రంలో హైదరాబాద్ న్యా క్ డీజీ ఎం.శ్రీనివాస్ రెడ్డితో కలిసి శిక్షణ ప్రయోగశాలలను ప్రారం భించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మేయర్ మాట్లా డుతూ స్కిల్ డెవలప్మెంట్ తోనే ఉజ్వల భవిష్యత్తు ఉ ంటుందని అన్నారు. నేటి ప్రపంచంలో విద్యతోపాటు నైపుణ్య అభివృద్ధి కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. యువత న్యాక్ కేంద్రంలో అందిం చే వివిధ ఉపాధి ఆధారిత కోర్సు లను సద్వినియోగం చేసుకోవా లని సూచించారు.కేవలం ఉద్యో గాల కోసం ఎదురు చూడకుండా నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపుని చ్చారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా యు వతకు ఉపాధి అవకాశాలు మె రుగు పడటంతో పాటు ఆర్థిక స్వాలంబన సాధ్యమవుతుందని తెలిపారు. మహిళలు కూడా వి విధ వృత్తి విద్యా కోర్సులను శిక్ష ణ పొందుతూ ఆర్థికంగా ఎదగా లని ఆకాంక్షించారు. నైపుణ్య శిక్ష ణ పొందిన మహిళలు, యువత తమ ప్రతిభతో మంచి భవిష్య త్తును నిర్మించుకునే అవకాశం ఉందన్నారు. శిక్షణ ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ ప రిజ్ఞానం పెంపొందుతుందని, వృ త్తి నైపుణ్యాలు మెరుగుపడతా యని పేర్కొన్నారు. మహిళలు,యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం గా న్యాక్ పనిచేస్తుం దన్నారు రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా నల్లగొండలో రూ.20 కోట్లతో మం త్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహ కారంతో చీూజ ని ఏర్పాటు చే యడం జరిగిందన్నారు. మహి ళలు, యువత దీనిని సద్వినియోగం చేసుకొని వృత్తి నైపు ణ్యాన్ని, ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు. హైదరాబాద్ న్యాక్ డైరెక్టర్ జన రల్ ఎం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడు తూ ఇప్పటివరకు నాక్ ద్వారా 5 .52 లక్షల మందికి పైగా నైపుణ్య శిక్షణ అందించడం జరిగింద న్నా రు. నిర్మాణ రంగానికి సంబం ధిం చి వివిధ ట్రేడ్ కోర్సులతో పాటు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఫిని షింగ్ స్కూల్, వీజ్రూ మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమా కోర్సు లను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. నల్లగొండలో న్యాక్ సొంత కార్ప స్ ఫండ్ నుంచి రూ. 20 కోట్ల వ్య యంతో నాలుగు అంతస్తుల భవ నాన్ని నిర్మించిందని పేర్కొన్నారు. ఈ కేంద్రంలో ఆరు ఆధునిక తర గతి గదులు, ఆరు అధునాతన శిక్షణ ప్రయోగశాలను, ఒకేసారి 250 మందికి శిక్షణ అందించే సా మర్థ్యం ఉ ందన్నారు. నల్లగొండ లో ఈ నైపుణ్య అభివృద్ధి కేంద్రా న్ని ఏర్పాటు చేయడానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎంతో చొ రవ చూపారని, ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపా రు. జిల్లాలో నిరుద్యోగ యువతకు, మహిళలకు ఉద్యోగ ఉపాధి అ వకాశాలు కల్పించడానికి మంత్రి ఎంతో కృషి చేస్తున్నారని అ న్నా రు. జనవరి 2026 నుంచి ఇప్ప టివరకు నల్గొండ కేంద్రం ద్వారా 1,118 మందికి శిక్షణ అందించ డం జరిగిందన్నారు. ఈ కేంద్రం కేవలం శిక్షణ సంస్థ మాత్రమే కా దని నిరుద్యోగ యువతకు ఉపా ధి ,స్వయం ఉపాధి మరియు ఆ ర్థిక స్వాలంబన కల్పించే ఒక గొ ప్ప వేదికని తెలిపారు. రాష్ట్రంలో నే ఈ కేంద్రాన్ని ఒక ఆదర్శవంత మైన నైపుణ్య అభివృద్ధి కేంద్రం గా తీర్చిదిద్దేందుకు న్యాక్ కట్టు బడి ఉందన్నారు.జిల్లాలోని ని రుద్యోగ యువత, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కో రారు. అనంతరం వివిధ కోర్సులలో శిక్ష ణ పూర్తి చేసుకున్న మహిళలు, యువతకు మేయర్ బుర్రి చైత న్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి సర్టిఫి కెట్లను పంపిణీ చేశారు. ఈ కా ర్యక్రమంలో NAC డైరెక్టర్ ఎం. రాజిరెడ్డి, NAC అసిస్టెంట్ డైరెక్ట ర్ నల్లగొండ చింతమల్ల రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం.ఏ.హఫీజ్ ఖాన్, మా జీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీని వాస్ రెడ్డి,డిప్యూటీ మేయర్ మ హమ్మద్ అఫ్రోజ్ అలీ అమేర్, కా ర్పొరేటర్ మహమ్మద్ ఇబ్రహీం, వివిధ కంపెనీల ప్రతినిధులు బూ రుగు సుభాష్, ప్రశాంత్ శెట్టి, డా క్టర్ వైష్ణవ అలీ, ఇమ్మానుయేల్, వినయ్ పంజర, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యా ద వ్, న్యాక్ సిబ్బంది చింతమల ర మేష్, మేడి సురేష్, ఏసమల్ల అ శోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్లకుంట ఎత్తిపోతల పనులు డిసెంబర్ చివరికల్లా పూర్తి చేయాలి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ఆదేశం

4,460 ఎకరాలకు సాగునీరు, 1,486 రైతు కుటుంబాలకు ప్ర యోజనం





ప్రజా దీవెన, కోదాడ: రైతుల పొ లాలకు సాగునీరు అందించి వ్య వసాయాన్ని మరింత సుసంప న్నం చేయడమే లక్ష్యంగా చేపట్టి న రెడ్లకుంట ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారు దల శాఖ మంత్రి కెప్టెన్ నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారుల ను, గుత్తేదారులను ఆదేశించా రు. డిసెంబర్ చివరి నాటికి మి గిలిన పనులన్నీ నాణ్యతా ప్ర మాణాలతో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందుబాటులోకి తీ సుకురావాలని స్పష్టం చేశారు. బుధవారం కోదాడ మండలం రెడ్లకుంట వద్ద పాలేరు వాగుపై నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాన్ని మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. కాలువ నిర్మాణ పనులు, భూగర్భ మోటార్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల పురోగతిని సమీక్షించారు.అనంతరం అధి కా రులతో నిర్వహించిన సమా వే శంలో ప్రాజెక్టు పనులపై వివ రా లు తెలుసుకున్నారు.

రూ.47.64 కోట్లతో బృహత్తర సాగునీటి ప్రాజెక్టు

రూ. 47.64 కోట్ల వ్యయంతో చేప ట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా ఆరు గ్రా మాల పరిధిలోని 4,460 ఎకరాల కు ఖరీఫ్, రబీ సీజన్లలో సాగునీ రు అందించనున్నట్లు మంత్రి తె లిపారు. ఒక్కొక్కటి 430 కిలో వాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు వీటీ మోటార్ల ద్వారా పాలేరు వా గు నుంచి నీటిని ఎత్తిపోసి రైతు ల పొలాలకు సరఫరా చేయను న్నట్లు వివరించారు.

గ్రామాల వారీగా సాగునీటి ప్రయోజనాలు ఇలా ఉన్నాయి

కాపుగల్లు1,608 ఎకరాలు,నల్లబండగూడెం 1,400 ఎకరా లు,రెడ్లకుంట 576 ఎకరాలు, చిమిరాల 410 ఎకరాలు, కూచి పూడి400 ఎకరాలు, ద్వారకుం ట 66 ఎకరాలు కాగా ఈ పథకం పూర్తయితే మొత్తం 1,486 కు టుంబాలకు ప్రయోజనం చేకూర నుంది. వీరిలో బీసీ కుటుంబాలు 720, ఎస్సీ కుటుంబాలు 446, ఓసీ కుటుంబాలు 290, ఎస్టీ కుటుంబాలు 30 ఉన్నాయ న్నా రు.

పెండింగ్ పనులు వేగవంతం చేయాలి

ప్రస్తుతం ప్రాజెక్టు పనులు 70 శా తం పూర్తయ్యాయని, మిగిలిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశిం చారు. నిర్మాణంలో ఎలాంటి నా ణ్యతా లోపాలు ఉ ండకూడదని, రైతులకు వీలైనంత త్వరగా సా గునీరు అందించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

ఎల్‌నినో నేపథ్యంలో రైతులకు కీలక సూచన

ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ.. ఇది రైతు పక్షపాత ప్ర భుత్వమని, రైతాంగానికి అన్ని విధాలా అండగా ఉంటామని స్ప ష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల ను దృష్టిలో పెట్టుకొని రాబోయే యాసంగి సీజన్‌లో తక్కువ నీటి తో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు విజ్ఞ ప్తి చేశారు. వాతావరణ పరిస్థితు లకు అనుగుణంగా పంటల ఎం పిక చేసుకోవడం ద్వారా నీటి ఎ ద్దడిని అధిగమించవచ్చని సూ చించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేం దుకు రైతులు, ప్రజల ప్రయోజ నాలను దృష్టిలో ఉంచుకుని అ వసరమైన అన్ని చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. కృష్ణా, గోదావరి జలాల పరిరక్షణ కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య త ఇస్తోందన్నారు. తెలంగాణలో సాగు విస్తీర్ణం, వరి ఉత్పత్తి, ధా న్యం కొనుగోళ్లు గణనీయంగా పె రిగాయని, ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలను చాలా వరకు కాపాడ గలిగామని తెలిపారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్ల కోసం ఇప్పటివరకు రూ. 90 వేల కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. రై తు భరోసా, పంటల బీమా సహా అన్ని అంశాల్లో రైతుల సంక్షేమ మే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

చిలుకూరు యంగ్ ఇండియా పాఠశాలపై సమీక్ష

ఇదే పర్యటనలో చిలుకూరు మండలంలో రూ. 200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇం టిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను కూడా మంత్రి పరిశీలించారు. 2027-- 28 విద్యా సంవత్సరం నుంచే త రగతులు ప్రారంభించేలా వచ్చే వి ద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే నిర్మాణ పనులు పూర్తి చే సి పాఠశాలను సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశా రు.ఈ పర్యటనలో నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారా వు, నీటిపారుదల శాఖ చీఫ్ ఇం జినీర్ నాగభూషణం, మార్కెట్ కమిటీ చైర్మన్, సంబంధిత శా ఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అలసకాని శరభేశ్వర రావు, రెడ్లకుంట సర్పంచ్ పోలం పల్లి కుటుంబ రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాలు నిరుపేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయి



ప్రజా దీవెన,కోదాడ : పేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కోదాడ బైపాస్ రోడ్డులోని కాకతీయ సేవా సమితి కళ్యాణ మండపంలో శంకర నేత్రాలయ సహకారంతో రావెళ్ల సీతారామయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని నల్గొండ ఎంపీ కుందూరు రఘువీరారెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి,మాజీ ఎమ్మెల్యే చందారావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి తోడుగా నిలుస్తూ పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న కాకతీయ సేవా సమితి ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే నల్లగొండ ఎంపీ రఘువీరారెడ్డి మాట్లాడుతూ ఉచిత సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమయ్యే ఆధునిక వైద్య పరికరాల కొనుగోలు కొరకు తన ఎంపీ నిధుల నుంచి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా మొదటి రోజు 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ, కాకతీయ సేవా సమితి అధ్యక్షులు పెదనాటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వేమూరి సురేష్, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, రావిళ్ళ సీతారామయ్య, పోటు రంగారావు, డాక్టర్ జాస్తి సుబ్బారావు, మార్తి మాధవరావు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్య రంగాలకు పెద్దపీట

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అతిపెద్ద నియోజకవర్గం తుంగతుర్తి- తుంగతుర్తి అభివృద్ధి తన లక్ష్యం

సంక్షేమ పథకాలతో పాటు పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నాం

డిసెంబర్ 31 లోపు ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తేవాలి



ప్రజా దీవెన, తుంగతుర్తి: సంక్షేమ పథకాలతో పాటు పేదలకు వైద్యం, విద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తుందని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వంద పడకల ఏరియా ఆసుపత్రిలో ఆస్పత్రి నిర్మాణ పనులతో పాటు ఆస్పత్రిపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 40 కోట్లకు పైగా నిధులు ఖర్చుచేసి నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకొని పరిశీలించారు. డిసెంబర్ 31 లోపు నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఈ ఆస్పత్రులలో అన్ని రకాల రోగాలకు వైద్య సేవలు అందుతాయని అన్నారు. వంద పడకల ఆస్పత్రిని కార్పొరేట్ హాస్పిటల్ కు ధీటుగా అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నట్లు, ఇంకా ఏమైనా సౌకర్యాలు కావాలంటే తనను సంప్రదించాలని అధికారులను కోరారు. ప్రశాంత వాతావరణంలో వైద్యులు పనిచేసేలా వాతావరణం ఉండాలని అన్నారు. వంద పడకల ఆస్పత్రిలో అన్ని రకాల రోగాలకు సంబంధించిన డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. డాక్టర్ వృత్తి చాలా పవిత్రమైనదని, విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గం అతిపెద్ద నియోజకవర్గం అని నియోజకవర్గ అభివృద్ధి తన చేయమని ఎమ్మెల్యే అన్నారు నియోజకవర్గంలో పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు 200 కోట్ల నిధులతో తిరుమలగిరిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ నిర్మాణం పూర్తయితే 2600 మంది విద్యార్థులు చదువుకోవడానికి వీలు కలుగుతుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పేద పిల్లలకు ఉన్నతమైన విద్యను అందించడంతో పాటు, పేదవాడికి రోగం వస్తే నయం చేసుకునే ఆర్థిక పరిస్థితుల్లో రోడ్డున పడకుండా ఉండేందుకు నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం తాను తీవ్రంగా కృషి చేసినట్లు తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకొని రోగులకు వైద్య సేవలు అందించాలని అన్నారు. అవసరమైతే ఆస్పత్రి ఆవరణలో డాక్టర్ల కోసం క్వార్టర్స్ నిర్మాణం కోసం కృషి చేస్తానని అన్నారు. అంతేగాక ఈ ప్రజా పాలన ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పథకం కింద పది లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం అందుతుందని అన్నారు. సంక్షేమ హాస్టల్లో చదువుకునే విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదే అని అన్నారు. గత పాలకులు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో వెనుకకు నెట్టేశారని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని అన్నారు. తిరుమలగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశానని, త్వరలో మద్దిరాల, నూతనకల్ మండలాలకు ఒక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మల్ కుమార్, డీసీహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు రేగట్టి రవి గౌడ్, స్థానిక సర్పంచ్ మాల్లెపాక సాయిబాబా, తో పాటు గ్రామాల సర్పంచ్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.'

ఇటుకలపహాడులో గంజాయి సేవిస్తున్న యువకులకు పరీక్షలు

- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్



శాలిగౌరారం, నవంబర్ 11 : శాలిగౌరారం మండలం ఇటుకలపహాడు గ్రామంలో గంజాయి అమ్ముతున్నారని, విక్రయిస్తున్నారని, గ్రామంలో యువకులు తాగుతున్నారని ఈగల్ ఫోర్స్ కు ఫిర్యాదు అందింది. ఫిర్యాదు మేరకు ఈరోజు ఈగల్ ఫోర్స్ డీఎస్పీ శంకర్ యాదవ్ వారి సిబ్బంది గ్రామానికి వచ్చి అనుమానం ఉన్న వ్యక్తులను తీసుకొచ్చి పరీక్షలు నిర్వహించారు. వారికి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో శాలిగౌరారం సీఐ రాజశేఖర్, ఎస్ఐ బాబు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ "శాలిగౌరారం మండలంలో ఎవరైనా గంజాయిని అమ్మినా, కొన్నా, తాగినా స్టేషన్ కు సమాచారం ఇవ్వాలి. 1908 నంబరుకు ఫిర్యాదు చేయాలి. గంజాయిని మండలం నుంచి తరిమికొట్టాలని పిలుపు నిచ్చారు.

నల్లగొండ నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం కేసులో కీలక చర్య

చందు మీ-సేవ, ఆధార్ కేంద్రాల శాశ్వత రద్దు

రాష్ట్ర ప్రభుత్వ కఠిన నిర్ణయం

ప్రజా దీవెన, నల్లగొండ: నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా వైద్య ఆరోగ్యశాఖలో కారుణ్య నియామకం పొందిన వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ అక్రమ వ్యవహారానికి సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మీ-సేవ నిర్వాహకుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న చందు మీ-సేవ కేంద్రంతో పాటు అక్కడి ఆధార్ కేంద్రాన్ని శాశ్వతంగా రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. డీఈఓ కార్యాలయం వద్ద చందు మీ-సేవ కేంద్రం, ఆధార్ కేంద్రాలను పనస చంద్రశేఖర్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నారని తెలిపారు. నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం జారీ వ్యవహారంలో పనస చంద్రశేఖర్ సహకరించినట్లు పోలీసుల విచారణలో ఆరోపణలు రావడంతో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం, అక్రమాలకు పాల్పడిన వారికి ఎలాంటి అవకాశం లేకుండా చందు మీ-సేవ, ఆధార్ కేంద్రాల అనుమతులను శాశ్వతంగా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుందని కలెక్టర్ స్పష్టం చేశారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనే సంకేతాన్ని ఈ నిర్ణయం ఇచ్చింది.

నల్లగొండ నగరంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం

గ్రౌండ్ +5 బ్లాక్ లలో480 ఇంది రమ్మ ఇండ్ల నిర్మాణం

ఇంటికి 8.5 లక్షల రూపాయల ఖర్చు

ప్రభుత్వ వాటా 5.0 లక్షలు, ల బ్ధిదారుల వాటా 3.5 లక్షలు.. అర్హులై న వారు మీ సేవా ద్వా రా ఆన్ లైన్ లో డిసెంబర్ 5 లోగా దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్



ప్రజావ దీవెన, నల్లగొండ: నల్గొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డు లో మామిళ్లగూడ వద్ద ఒక్కో ప్లాట్ రూ. 8.50 లక్షల రూపాయల చొప్పున (G+5) బ్లాక్‌లలో 480 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడానికి ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి.నెం.579 ద్వారా అనుమతించిందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి ప్రభుత్వం రూ. 5.00 లక్షల సబ్సిడీ ఇస్తుందని, లబ్ధిదారుల వాటా కింద యూనిట్‌కు రూ. 3.50 లక్షలను చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అర్హులైన వారు మీ సేవా ద్వారా ఆన్ లైన్ లో డిసెంబర్ 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.దరఖాస్తు చేసుకునేందుకు నల్గొండ మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలో ఇల్లు, ప్లాట్ లేని వారై ఉండాలని, వార్షిక ఆదాయం 6.0 లక్షలు దాటకూ డదని, ఒక్క కుటుంబం నుండి ఒక్కరూ మాత్రమే దరఖాస్తు చే సుకోవాలని, దరఖాస్తు చేసుకు నేవారు తప్పనిసరిగా నల్గొండ కార్పొరేషన్ పరిధిలో నివాసి అ యి ఉండాలని తెలిపారు.

ఈనెల 20లోగా దరఖాస్తుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్





ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర స వరణ (సర్) కార్యక్రమంలో భా గంగా వివిధ కారణాలవల్ల ఎ న్యూమరేషన్ ఫారాలు సమ ర్పించని, గైర్హాజరు ఓటర్లు, శాశ్వతంగా చిరునామా మారిన ఓటర్లు ఈనెల 20 లోగా నిర్దేశిత అనెక్జర్ లో దరఖాస్తు చేసుకునేం దుకు కేంద్ర ఎన్నికల సంఘం అవ కాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్ మరియు వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం ఓటరు జాబితా పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గతంలో ఏదైనా కారణం చేత ఎన్యుమరేషన్ ఫారాలు ఇవ్వనివారు మరోసారి ఫారాలు సమర్పించేందుకు అవకాశం కల్పించడంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్ల వివరాలను కేటగిరి వారిగా ఇది వరకే బిఎల్ ఓ లకు పంపడం జరిగిందని, బిఎల్ఓ ల ద్వారా బిఎల్ఎ లకు ఆ జాబితాను ఇచ్చి గ్రామంలో మరోసారి చదివి వినిపించి ఎన్యూమరేషన్ ఫారాలు ఇచ్చే విధంగా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కోరారు. ఈనెల 20 లోపు నిర్దేశిత అనెక్జర్ లో దరఖాస్తు చేసుకోవాలని, ఇది వరకే నమోదైన వారు మళ్ళీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, కేవలం ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు మాత్రమే నవంబర్ 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో సేకరించని ఫారాలు 1,58,630 ఉన్నాయని, ఇందులో 32,000 మంది చనిపోగా, లక్ష 44 వేల మంది ఓటర్లు శాశ్వతంగా చిరునామా మారిన కేసులు ఉన్నాయని, 18 వేల మంది ఓటర్లు ఇదివరకే ఎదో ఒక చోట నమోదయ్యారని , 6,978 మంది ఆబ్సెంట్ ఓటర్లు ఉన్నారని, ఇతరులు 182 మంది ఉన్నారని వివరించారు. ఇందులో శాశ్వతంగా చిరునామా మారిన వారు, అలాగే ఆబ్సెంట్ ఓటర్లు మాత్రం ఈనెల 20 లోపు ఎన్నికల సంఘం నిర్దేశించిన ఫారమ్ లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ విషయం పై విస్తృతంగా ప్రచారం చేసి అవసరం ఉన్నవారందరూ తిరిగి నమోదయ్యేలా చూడాల్సిందిగా ఆయన కోరారు. వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఓటరు జాబితాకు సంబంధించి నవంబర్ 6 వరకు ఫారం- 18 లో ఓటరు నమోదు కు చివరి తేదీ అయిన్నప్పటికీ ఈనెల 25 నుండి డిసెంబర్ 10 వరకు నిర్వహించే అభ్యంతరాలు, ఫిర్యాదుల సమయంలో ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, అలాగే డిసెంబర్ 30 తర్వాత కూడా వరంగల్- ఖమ్మం -నల్గొండ నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలు, వచ్చిన ఫారం -18 లు,తదితర వివరాలను వెల్లడించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నుండి ముంతాజ్, బిజెపి నుండి పీ. లింగస్వామి, సిపిఐఎం నుండి నర్సిరెడ్డి, టిఆర్ఎస్ నుండి బీ.పిచ్చయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ నుండి డాక్టర్ ఎస్. కె. అన్సారి, టిడిపి నుండి తేలు అన్నా రవి, ఎన్నికల విభాగం సూపరింటెం డెంట్ కృష్ణమూర్తి, డిటి సందీప్ తదితరులు ఉన్నారు.

జిల్లా యంత్రాంగానికి రెవెన్యూ మంత్రి అభినందనలు



ప్రజా దీవెన, నల్లగొండ: నల్గొండ జిల్లాలో మొదటి విడత భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా సవ్యంగా నిర్వహిస్తుండడం పట్ల నల్గొండ జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ ను, రెవెన్యూ యంత్రాంగాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. బుధవారం ఆయన హైదరాబాద్ నుండి సీసీఎల్ఏ, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్ కలెక్టర్లు సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో భూముల రీ సర్వే , ఇందిరమ్మ ఇండ్ల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందుగా నల్గొండ జిల్లాలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వే వివరాలను జిల్లా కలెక్టర్ మంత్రికి సవివరంగా తెలియజేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఎస్ఓపి ప్రకారం రీ సర్వే నిర్వహిస్తున్నామని, సర్వే సందర్భంగా తెలుసుకున్న అనుభవాలు, ఎదురైన సమస్యలు అన్నింటిని మంత్రికి వివరించారు. అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రీ సర్వే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించే పరిస్థితి లేకుండా చక్కగా నిర్వహిస్తున్నందుకుగాను జిల్లా కలెక్టర్ ను అలాగే ఆర్డీవోలను, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా భూముల సర్వే నిర్వహించి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నదని తెలిపారు. సర్వే విషయాన్ని రైతులకు ముందుగానే తెలియజేయాలని, అలాగే సర్వే తర్వాత, ఏమైనా సమస్యలు ఉంటే నోటీసులు ఇచ్చే సమయంలో కూడా గ్రామంలో రెండుసార్లు చాటింపు వేయించాలని, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు గ్రామాలకు వెళ్లి గ్రామాలలో సమావేశం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని, వారి సమస్యలను సందేహాలను నివృత్తి చేయాలని చెప్పారు. దీని ద్వారా సాధ్యమైనంత వరకు అభ్యంతరాలను తగ్గించవచ్చని డిసెంబర్ మొదటి వారంలోగా మొదటి విడత సర్వే పూర్తి చేయాలని చెప్పారు. అలాగే భూములకు సంబంధించిన ఏలాంటి సమస్య రాకుండా చూసుకోవాలని మంత్రి ఆదేశించారు. అటవీ భూములకు సంబంధించి సమస్యలు క్షుణ్ణంగా పరిశీలించాలని, 22 ఏ పై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు . ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షిస్తూ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని వేగవంతం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఈ నెలాఖ రులోగా లబ్ధిదారులకు అందిం చేలా చూడాలని మంత్రి ఆదేశిం చారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవోలు వై. అశోక్ రెడ్డి, శ్రీదేవి, రమణారెడ్డి, వసజా రాణి, సర్వే లాండ్ రికా ర్డ్స్ ఎడి దేవరాజ్, తదితరులు ఉన్నారు .

ఆలయానికి దాతల సహకారం అభినందనీయం

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



ప్రజా దీవెన,దేవరకొండ: దేవరకొండలోని అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి, అలాగే స్వామి వారికి నిరంతర అన్నదాన కార్యక్రమానికి ముందుకు వచ్చిన దాతల కుటుంబ సభ్యులకు తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో జరిగిన 'అయ్యప్ప మాలాధారణ' ప్రారంభోత్సవ కార్యక్రమంలో, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్‌తో కలిసి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో స్వామి వారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, దైవాశీస్సులు పొందారు. అదేవిధంగా, ఆలయంలో అన్నప్రసాద వితరణ కోసం రూ. 12,12,111 విలువైన స్టీల్ టేబుళ్లు, బెంచీలు మరియు ట్రాలీలను విరాళంగా అందించిన దివంగత గర్లపాటి వాచస్పతి గారి కుటుంబ సభ్యులకు---వారి తల్లిదండ్రులు గర్లపాటి ఎల్లయ్య మరియు అరుణ కుమారి గార్లకు---శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మరియు ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్వామి వారి సేవలో భాగంగా, అన్నప్రసాద వితరణకు అవసరమైన పరికరాలను సమకూర్చడం ఎంతో అభినందనీయమని వారు పేర్కొన్నారు. అనంతరం, ఎమ్మెల్యే బాలు నాయక్ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి దీపావళి శుభాకాంక్షలు తెలిపి, ఆయనను శాలువాతో సత్కరించారు. అయ్యప్ప స్వామి మాలాధారణ ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తిభావంతో నిండిపోగా, ఎమ్మెల్యే బాలు నాయక్ అక్కడ ఉన్న అయ్యప్ప భక్తులను పలకరించారు. మున్సిపల్ చైర్మెన్ పున్నా శైలజా వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకట్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, వడ్త్యా దేవేందర్ నాయక్, శిరందాసు కృష్ణయ్య, గురుస్వామి చిలువేరు చంద్రమౌళి స్వామి, ఆలయ మండలి అధ్యక్షులు నక్కా వెంకటేష్ యాదవ్, లోకల్ వెంకటేష్ యాదవ్, తాడూరి సత్యం. లోకసాని శ్రీధర్‌రెడ్డి, కొర్ర రాంసింగ్‌నాయక్, పానుగంటి మల్లయ్య, దొడ్డి సుధాకర్, కర్నాటి పురుషోత్తం, గార్లపాటి ఎల్లయ్య, పొన్నెబోయిన సైదులు, బిక్కు నాయక్, కొందురు పవన్‌కుమార్, అంగిరేకుల నాగభూషణం, గడ్డం వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నాగం శ్రీదేవిపై దాడిపై జాతీయ మహిళా కమిషన్ విచారణ





వివరాలు సేకరించిన జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు నివేదితా సుబ్రమణియన్

మంత్రి కోమటిరెడ్డి స్పందించాలి

ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: నల్గొండ పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి తల్లి నాగం శ్రీదేవిపై జరిగిన దాడి ఘటన రాష్ట్రవ్యాప్తంగా చ ర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై వాస్తవాలను వెలికితీ సేందుకు జాతీయ మహిళా కమి షన్ రంగంలోకి దిగింది. కమిషన్ నిజనిర్ధారణ కమిటీ నల్గొండలో పర్యటించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది.జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు నివేదితా సుబ్రమణియన్, సీనియర్ కోఆర్డినేటర్ కంచన్ ఖట్టర్ బాధితురాలు నాగం శ్రీదేవి నివాసాన్ని సందర్శించారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి, దాడి జరిగిన తీరును, ఇంటి వద్ద ధ్వంసమైన వస్తువులను, ఆస్తి నష్టాన్ని నమోదు చేసుకున్నారు. అనంతరం బాధితురాలితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న ఆధారాలను సేకరించి విచారణ జరిపారు.

బాధ్యులపై కఠిన చర్యలకు విజ్ఞ ప్తి

ఈ ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్య లు తీసుకోవాలని, బాధిత కుటుం బానికి న్యాయం జరిగేలా చూడాలని కమిటీని కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు కోరారు. రాజకీయ విభేదాల పేరుతో మహిళలపై భౌతిక దాడులకు పాల్పడటాన్ని సహించరాదని స్పష్టం చేశారు. ఈ దాడి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలతో జరిగిందా? భర్తను కోల్పోయిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలిపై జరిగిన దాడికి ఆయన మద్దతు ఉందా? అనే అంశాలపై మంత్రి బహిరంగంగా స్పందించి ప్రజలకు వివరణ ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంత్రి ప్రధాన అనుచరుడిగా పేర్కొంటున్న మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రస్తుత మేయర్ భర్త బుర్రి శ్రీనివాస్ రెడ్డి నాగం శ్రీదేవి, ఆమె సోదరుడు విష్ణువర్ధన్‌పై భౌతిక దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఇప్పటివరకు కఠినమైన సెక్షన్లు నమోదు చేయలేదని విమర్శించారు. అదేవిధంగా ఐదుగురు ముస్లిం కార్పొరేటర్లు మందిరంపై దాడి చేసి దేవతామూర్తుల చిత్రపటాలను ధ్వంసం చేశారన్న ఆరోపణలపైనా సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. ఈ ఘటనలో ఎవరెవరి ప్రమేయం ఉన్నా వారందరినీ చట్టం ముందు నిలబెట్టాలని డిమాండ్ చేశారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

రాజకీయాల్లో భౌతిక దాడులకు ఏమాత్రం చోటు ఉండకూడదని, మహిళలపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. బాధితురాలు నాగం శ్రీదేవికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ విచారణ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంజియు ఇండోర్ స్టేడియం రాష్ట్రస్థాయి క్రీడలకు సిద్ధం

తెలంగాణ క్రీడ శాఖ అధికారులకు వివరాల సమర్పణ



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో తయారుచేసిన సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ లో ఉన్న వివిధ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తెలంగాణ ప్రభుత్వం చేపట్టబోయే వివిధ క్రీడలకు సంబంధించి ఈ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ని ఉపయోగించుకోవాలని గౌరవ చైర్మన్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ శివనాగిరెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ స్పోర్ట్స్ శ్రీమతి వాణి ప్రసాద్ ఐఏఎస్ మరియు వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాల ఐఏఎస్ గార్లకు నేడు స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డా మద్దిలేటి, ఇండోర్ స్టేడియం పూర్తి వివరాలను సమర్పించారు . ఈ సందర్భంగా మహాత్మా గాంధీ యూనివర్సిటీ లో ఉండే ఈ ఇండోర్ స్టేడియం భవిష్యత్తులో చాలా క్రీడలకు వేదికగా మారుతుందని స్పోర్ట్స్ బోర్డర్ సెక్రటరీ డా మద్దిలేటి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా జాతీయ విద్యా దినో త్సవం



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: మహాత్మా గాంధీ విశ్వవిద్యాల యం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ సోషల్ సైన్స్ సైన్స్, యూని వర్సిటీ కాలేజ్ ఆఫ్ బిజినెస్ మే నేజ్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ దినోత్సవం ఘనంగా ని ర్వహించడం జరిగింది. మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతి ని పురస్కరించుకొని జాతీయ వి ద్యా దినోత్సవాన్ని జాతీయ సే వా పథకం ఆధ్వర్యంలో నిర్వహిం చారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కాజా అల్తా హుస్సేన్ గారు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ మేధావుల్లో మౌలానా అబ్దుల్ కలాం అజాద్ గారు ఒకరు. తన విజ్ఞతతో దూరదర్శితో వ్యవహరించిన గొప్ప మేధావి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ఆయన సేవలు విద్యార్థులందరూ గుర్తించుకోదగినవి. ఆయన అడుగుజాడల్లో నటిస్తూ ఉ త్తమ విద్యార్థులుగా రూపొందాలని ఆయన సూచించారు. ఆయన కృషి వల్లనే ఆలీగాడు విశ్వవిద్యాలయం లాంటి ఉత్తమ విద్యాసంస్థలు రూపొందాయని కొనియాడారు. ఈ కార్యక్రమానికి జాతీయ సేవా పథకం సమస్వయకర్త డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి అధ్యక్షత వహించగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ ప్రియ విశిష్ట అతిథిగా విచ్చేశారు ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ మ్యాతరీ ఆనంద్, డాక్టర్ మహమ్మద్ షరీఫ్ , డాక్టర్ కిరణ్ మై, ఇతర అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ రెడ్డి డాక్టర్ శ్రావణ్ కుమార్ డాక్టర్ జి నరసింహ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

అర్ష్‌దీప్, హార్దిక్ ట్రేడ్ పూర్తి



గతకొంతకాలంగా వస్తున్న ఊహాగానాలను నిజం చేస్తూ.. ఐపీఎల్ 2027కు ముందే ఫ్రాంచైజీల మధ్య భారీ ట్రేడ్ చోటుచేసుకుంది. ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఆ జట్టును వీడి పంజాబ్ కింగ్స్‌లో చేరనున్నాడు. మరోవైపు పంజాబ్ జట్టుకు కీలక బౌలర్‌గా ఉన్న అర్ష్‌దీప్ సింగ్ ముంబయి ఇండియన్స్‌కు మారనున్నాడు. ఈ రెండు జట్ల మధ్య ఆటగాళ్ల మార్పిడి పూర్తయింది. దీనిపై గతకొంతకాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఐపీఎల్ దీన్ని అధికారికంగా ప్రకటించింది. హార్దిక్ పాండ్యాకు ముంబయి ఇండియన్స్‌తో సుదీర్ఘ అనుబంధం ఉంది. 2015లో తొలిసారి ఆ జట్టులో చేరిన అతడు.. 2015, 2017, 2019, 2020 సీజన్లలో టైటిల్ సాధించిన జట్టులో కీలక పాత్ర పోషించాడు. ఏడు సీజన్ల పాటు ముంబయి తరఫున ఆడిన తర్వాత 2022లో గుజరాత్ టైటాన్స్‌కు మారాడు. తొలి సీజన్‌లోనే కెప్టెన్‌గా ఆ జట్టుకు టైటిల్ అందించాడు. 2023లోనూ గుజరాత్ ఫైనల్‌కు చేరింది. 2024లో తిరిగి ముంబయికి వచ్చిన హార్దిక్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. హార్దిక్ ఇప్పటివరకు 162 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. 2,955 పరుగులు చేయడంతో పాటు 82 వికెట్లు పడగొట్టాడు. 146.28 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. ముంబయిలో రూ. 16.35 కోట్ల పారితోషికం అందుకున్న అతడు.. ఇప్పుడు రూ. 18 కోట్లకు పంజాబ్ కింగ్స్‌లో చేరనున్నాడు. 2019లో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన అర్ష్‌దీప్ సింగ్.. ఎనిమిది సీజన్ల పాటు పంజాబ్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఆ జట్టు తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. 96 మ్యాచ్‌ల్లో 111 వికెట్లు పడగొట్టాడు. 2025 సీజన్‌లో 21 వికెట్లు తీయగా.. 2026లో 14 వికెట్లు సాధించాడు. కొత్త బంతితో వికెట్లు తీయడంలో, చివరి ఓవర్లలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంలో అతడు దిట్ట. ఇప్పుడు రూ. 18 కోట్ల పారితోషికంతో ముంబయి జట్టులోకి అడుగుపెట్టనున్నాడు.

‘శ్రేయస్.. నీ వెనక నేనున్నా’..

పంజాబ్‌కు మారిన తర్వాత హార్దిక్ ఫస్ట్ రియాక్షన్

ఐపీఎల్‌లో కీలక ఆటగాళ్ల ట్రేడింగ్ వ్యవహారం క్రికెట్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టులోకి మారనున్న నేపథ్యంలో ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బలమైన సందేశం పంపించాడు. కెప్టెన్ శ్రేయస్, కోచ్ రికీ పాంటింగ్ సహా పంజాబ్ జట్టు మొత్తానికి తాను అండగా ఉంటానని స్పష్టం చేశాడు. పంజాబ్ జెర్సీతో ఉన్న ఫొటోను కూడా పంచుకున్నాడు. రెండుసార్లు ఐపీఎల్ ఫైనల్‌కు చేరిన పంజాబ్ కింగ్స్‌తో కలిసి పనిచేయడం పట్ల హార్దిక్ ఉత్సాహం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ‘నా కెప్టెన్ శ్రేయస్.. నా కోచ్ రికీ.. నా జట్టు.. పంజాబ్ మొత్తం.. మీ వెనక నేనున్నా’ అంటూ పోస్ట్ చేశాడు. తన ఆల్‌రౌండ్ నైపుణ్యాలతో జట్టుకు ఉపయోగపడతాననే సంకేతాలిచ్చాడు. ఐపీఎల్ చరిత్రలోనే కీలకమైన ఆటగాళ్ల మార్పిడిలో భాగంగా పంజాబ్ కింగ్స్‌కు హార్దిక్ వెళ్లనున్నాడు. అతడి స్థానంలో భారత టీ20 బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌లో చేరనున్నాడు. ఈ ట్రేడింగ్‌లో హార్దిక్ పారితోషికం రూ. 16.35 కోట్ల నుంచి రూ. 18 కోట్లకు పెరగనుంది. అర్ష్‌దీప్ మాత్రం తన ప్రస్తుత రూ. 18 కోట్ల పారితోషికంతోనే ముంబై జట్టుకు మారనున్నాడు. హార్దిక్‌కు ముంబై ఇండియన్స్‌తో సుదీర్ఘ అనుబంధం ఉంది. 2015లో ఆ జట్టులో చేరిన అతడు 2015, 2017, 2019, 2020 సీజన్లలో టైటిళ్లు గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఏడు సీజన్ల తర్వాత గుజరాత్ టైటాన్స్‌కు మారి, తొలి సీజన్‌లోనే కెప్టెన్‌గా టైటిల్ అందించాడు. 2023లోనూ ఆ జట్టును ఫైనల్‌కు చేర్చాడు. 2024లో తిరిగి ముంబైకి వచ్చి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. మొత్తం 162 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో హార్దిక్ 2,955 పరుగులు చేయడంతోపాటు 82 వికెట్లు పడగొట్టాడు. అయితే ముంబైతో రెండో విడత మూడేళ్ల ప్రయాణంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. 39 మ్యాచ్‌ల్లో 647 పరుగులు, 29 వికెట్లు సాధించాడు. అతడి కెప్టెన్సీలో ముంబై 2025లో ప్లేఆఫ్స్‌కు చేరగా, 2024, 2026 సీజన్లలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. మరోవైపు అర్ష్‌దీప్ 2019లో పంజాబ్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఆ జట్టు తరఫున 96 మ్యాచ్‌ల్లో 111 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. 2025 సీజన్‌లో 21 వికెట్లు, 2026లో 14 వికెట్లు పడగొట్టాడు. కొత్త బంతితో వికెట్లు తీయడంతోపాటు డెత్ ఓవర్లలోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం అతడికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది.

న్యూజిలాండ్‌లో ప్రియురాలి చేతికి ఉంగరం తొడిగిన టీమిండియా

బౌలర్ అర్ష్‌దీప్ సింగ్



టీమిండియా స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ తన వ్యక్తిగత జీవితంలో సరికొత్త ప్రయాణాన్ని ప్రారంభించాడు. ప్రముఖ మోడల్, సినీ నటి సమ్రీన్ కౌర్ ముందు తన ప్రేమను వ్యక్తపరిచాడు. బుధవారం (నవంబర్ 11) న్యూజిలాండ్‌లో అర్ష్‌దీప్ తన ప్రియురాలికి ప్రపోజ్ చేయగా, ఆమె “యస్” అని చెప్పడంతో ఆమె వేలికి ఉంగరం తొడిగాడు. దీనికి సంబంధించిన ఫొటోలను అర్ష్‌దీప్, సమ్రీన్ ఇద్దరూ తమ సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకున్నారు. సమ్రీన్ ఈ సందర్భంగా ఒక భావోద్వేగ సందేశాన్ని రాసుకొచ్చారు. “జీవితం మాకు ఇచ్చిన వాటన్నింటికంటే ఒకరినొకరం దక్కించుకోవడమే నాకు అత్యంత సంతోషాన్నిచ్చింది. జీవితాంతం కలిసి ఉండే ప్రయాణం మొదలైంది. 11.11.2026 (హాయ్ ఫియాన్సీ) అంటూ ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం భారత వన్డే జట్టు పర్యటనలో భాగంగా అర్ష్‌దీప్ న్యూజిలాండ్‌లోనే ఉన్నాడు. అక్కడే తన ప్రియురాలి ప్రేమను గెలుచుకుని పెళ్లి దిశగా ముందడుగు వేశాడు. వీరిద్దరి బంధం గురించి ఇప్పటికే క్రీడా వర్గాల్లో చర్చ సాగింది. ఈ ఏడాది జులై ఆఖర్లో అర్ష్‌దీప్ “మై పర్సన్” అనే క్యాప్షన్‌తో సమ్రీన్ ఫొటోలను పంచుకుని తమ బంధాన్ని అధికారికంగా వెల్లడించారు. అంతకుముందు ఒక మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీసిన సందర్భంగా వీరిద్దరూ కలిసి చేసే డ్యాన్స్ స్టెప్‌తో అర్ష్‌దీప్ సంబరాలు చేసుకుని, ఆ ఘనతను ఆమెకే అంకితం ఇచ్చారు.

ఎవరీ సమ్రీన్ కౌర్?

జమ్మూకశ్మీర్‌కు చెందిన సమ్రీన్ కౌర్ మోడల్‌గా, నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2018 ఫెమినా మిస్ ఇండియా పోటీల్లో ఆమె ఫైనలిస్ట్‌గా నిలిచారు. భారత క్రికెట్ జట్టు చారిత్రక విజయం ఆధారంగా తెరకెక్కిన ‘83’ సినిమాలో సమ్రీన్ నటించారు. అలాగే జీ5 వెబ్ సిరీస్ ‘నెయిల్ పాలిష్’, పంజాబీ చిత్రం ‘సర్దార్ జీ 2’లలోనూ ముఖ్య పాత్రలు పోషించారు. గురు రంధావా, బాద్‌షా, జుబిన్ నౌటియాల్ వంటి ప్రముఖ గాయకుల మ్యూజిక్ వీడియోలలో కూడా నటించి విశేష ఆదరణ దక్కించుకున్నారు.

భారత ఒలింపిక్ సంఘంలో ముదిరిన వివాదం

పీటీ ఉష, అంజు జార్జ్ మధ్య మాటల యుద్ధం

భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) వేదికగా దేశంలోని ఇద్దరు దిగ్గజ మాజీ అథ్లెట్లు పీటీ ఉష, అంజూ బాబీ జార్జ్ మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ట్రాక్ మీద దేశ ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన కేరళకు చెందిన ఈ ఇద్దరు స్టార్ క్రీడాకారిణులు, ఇప్పుడు క్రీడా పరిపాలనలో ఎదురెదురు నిలిచారు. తాజా పరిణామాలు భారత క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఐవోఏలోని ‘స్పోర్ట్స్ పర్సన్స్ ఆఫ్ ఔట్‌స్టాండింగ్ మెరిట్’ (ఎస్‌వోఎం) కేటగిరీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఐవోఏ ప్రస్తుత అధ్యక్షురాలు పీటీ ఉష ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో తారుమారు జరిగిందని పేర్కొంటూ, దీనిపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆమె అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ)కి లేఖ రాశారు. ఉష చేసిన ఈ ఆరోపణలను ఎస్‌వోఎం ఎన్నికల్లో గెలిచిన అంజూ బాబీ జార్జ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఎన్నికల్లో అత్యధికంగా 53 ఓట్లు సాధించి అంజూ జార్జ్ విజయం సాధించారు. పీటీ ఉష ఆరోపణలపై ఆమె ఘాటుగా స్పందిస్తూ, ప్రజాస్వామ్య ప్రక్రియలో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ రెండింటినీ



స్వీకరించడం నేర్చుకోవాలని హితవు పలికారు. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్నవారు అందుకు తగిన బలమైన ఆధారాలను సమర్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఏదైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారిక వేదికలను ఆశ్రయించాలి తప్ప, ఇలా బహిరంగ ఆరోపణలు చేయడం సరైంది కాదని స్పష్టం చేశారు. తనకు ఎవరు ఓటు వేస్తారో ముందుగానే ఊహించడం ఎవరికీ సాధ్యం కాదని పేర్కొన్న అంజూ, ఈ విజయం భారత క్రీడారంగానికి తాను చేసిన సేవలకు దక్కిన గుర్తింపు అని అన్నారు. 1984 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో కేవలం 0.01 సెకను తేడాతో కాంస్య పతకాన్ని చేజార్చుకున్న పీటీ ఉష, ఆ తర్వాత భారత అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తిగా ఎదిగి ఐవోఏ అధ్యక్ష పీఠాన్ని అధిరోహించారు. మరోవైపు ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో లాంగ్ జంప్‌లో కాంస్య పతకం సాధించిన అంజూ బాబీ జార్జ్ సైతం భారత క్రీడా పరిపాలనలో పలు కీలక బాధ్యతలను నిర్వర్తించారు. అంజూ బాబీ జార్జ్ సాధించిన ఈ విజయం ఆమెను ఐవోఏ అధ్యక్ష పదవికి పోటీదారుగా మారుస్తుందని చెప్పలేకపోయినప్పటికీ, దేశ ఒలింపిక్ సంఘ పరిపాలనలో వీరిద్దరి మధ్య నెలకొన్న విభేదాలు సంస్థాగత పోరును స్పష్టంగా సూచిస్తున్నాయి. ట్రాక్ వెలుపల కేరళకు చెందిన ఇద్దరు మేటి క్రీడాకారిణులు ఇలా వివాదంలో చిక్కుకోవడం క్రీడాభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

టెస్ట్ క్రికెట్‌లో పాకిస్థాన్ అరుదైన రికార్డు..

149 ఏళ్ల చరిత్రలో తొలిసారి!

టెస్ట్ క్రికెట్‌లో పాకిస్థాన్ జట్టు ఒక అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. శ్రీలంకతో రావల్పిండి వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో పాకిస్థాన్ తరఫున అరంగేట్రం చేసిన ముగ్గురు ఆటగాళ్లు ఒకే ఇన్నింగ్స్‌లో అర్ధశతకాలు సాధించి సత్తా చాటారు. 149 ఏళ్ల సుదీర్ఘ టెస్ట్ చరిత్రలో, ఒక జట్టు అరంగేట్ర టెస్టు కాని మ్యాచ్‌లో ముగ్గురు డెబ్యూటెంట్లు హాఫ్ సెంచరీలు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ ఘనతతో పాకిస్థాన్ జట్టు పటిష్ఠ స్థితిలో నిలిచింది. జట్టులో సమూల మార్పులతో బరిలోకి దిగిన పాకిస్థాన్, ఈ మ్యాచ్‌లో నలుగురు కొత్త ఆటగాళ్లకు అవకాశం ఇచ్చింది. వీరిలో బ్యాటర్లు తయ్యబ్ ఆరిఫ్, మహ్మద్ తాహా, అరాఫత్ మిన్హాస్ తమ తొలి మ్యాచ్‌లోనే అర్ధశతకాలతో అదరగొట్టారు. తయ్యబ్ ఆరిఫ్ కేవలం 51 బంతుల్లోనే 57 పరుగులు చేసి దూకుడు ప్రదర్శించగా, మూడో స్థానంలో వచ్చిన మహ్మద్ తాహా 105 బంతుల్లో 51 పరుగులతో నిలకడగా ఆడాడు. ఆ తర్వాత అరాఫత్ మిన్హాస్ 9 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 52 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. ఈ ముగ్గురి ప్రదర్శన పాకిస్థాన్ భారీ స్కోరుకు పునాది వేసింది. గతంలో 1992లో భారత్‌తో



జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే తరఫున ముగ్గురు అరంగేట్ర ఆటగాళ్లు హాఫ్ సెంచరీలు చేశారు. అయితే అది జింబాబ్వేకు మొట్టమొదటి టెస్ట్ మ్యాచ్. కానీ, పాకిస్థాన్ జట్టు తమ అరంగేట్ర టెస్టు కాకుండానే ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది. ఇదే మ్యాచ్‌లో పాకిస్థాన్ బ్యాటర్ సౌద్ షకీల్ శతకానికి చేరువలో విఫలమయ్యాడు. 199 బంతుల్లో 9 ఫోర్లతో 93 పరుగులు చేసిన అతను, శ్రీలంక బౌలర్ అసిత్ ఫెర్నాండో బౌలింగ్‌లో వికెట్ కీపర్ కుశాల్ మెండిస్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఫెర్నాండోకు ఇది 100వ టెస్ట్ వికెట్ కావడం గమనార్హం. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీలంకను మరో అరంగేట్ర ఆటగాడు, బౌలర్ సాఖిబ్ ఖాన్ దెబ్బతీశాడు. అతను రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక జట్టు పాకిస్థాన్ మొదటి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 320 పరుగులు వెనుకబడి ఉంది. క్రీజులో కెప్టెన్ ధనంజయ డిసిల్వా (22), కమిందు మెండిస్ (40) ఉన్నారు. వెలుతురు సరిగా లేకపోవడంతో షెడ్యూల్ కంటే 25 నిమిషాల ముందే అంపైర్లు ఆటను నిలిపివేశారు.



'వారణాసి' తర్వాత ప్రియాంక చోప్రా టాలీవుడ్‌కి బైబై

ఎస్.ఎస్. రాజమౌళి - మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కిన భారీ అడ్వెంచర్ థ్రిల్లర్ మూవీ -వారణాసి-తో ప్రియాంక చోప్రా జానాస్ చాలా ఏళ్ల తర్వాత సౌత్ కి వస్తున్నారు. 2027 ఏప్రిల్ 7న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్‌లో తన పాత్ర గురించి చాలా చర్చ సాగుతోంది. అలాగే ఈ చిత్రంలో నటించిన తర్వాత ప్రియాంక చోప్రా టాలీవుడ్ ప్రయాణం కొనసాగుతుందా లేదా అనే ప్రశ్న సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రస్తుతం హాలీవుడ్ సహా అంతర్జాతీయ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ప్రియాంక కేవలం కథలో దమ్ముండి గ్లోబల్ అపీల్ ఉన్న చిత్రాలనే అంగీకరిస్తున్నారు. ప్రభాస్, అల్లు అర్జున్, ఎన్టీఆర్ వంటి పాన్ ఇండియన్ స్టార్ల సరసన నటనకు ప్రాధాన్యమున్న పవర్‌ఫుల్ రోల్స్ వస్తే టాలీవుడ్ ఆఫర్లను వదులుకోవడానికి ఎంతమాత్రం సిద్ధంగా ఉండరని అభిమానులు ఊహిస్తున్నారు. అంతేకాకుండా గతంలో -జంజీర్- (తూఫాన్) చిత్రంలో రామ్ చరణ్‌తో నటించిన అనుభవం పీసీ సొంతం. భవిష్యత్తులో సరైన స్క్రిప్ట్ కుదిరితే చరణ్ సరసన మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోవడానికి కూడా సుముఖంగానే ఉన్నట్లు ఇండస్ట్రీ టాక్. ఇక నటనతో పాటు నిర్మాణ రంగాన్ని కూడా ఏకకాలంలో పర్యవేక్షిస్తున్న ప్రియాంక చోప్రా తన తదుపరి ప్రాజెక్ట్‌ను ఇప్పటికే ఖరారు చేశారు. తన సొంత నిర్మాణ సంస్థ పర్పల్ పెబుల్ పిక్చర్స్ పతాకంపై జాతీయ అవార్డు పొందిన మరాఠీ హిట్ చిత్రం -వెంటిలేటర్-కు సీక్వెల్‌గా -వెంటిలేటర్ 2-ను అధికారికంగా ప్రకటించారు. రాజేష్ మాపుస్కర్ దర్శకత్వంలో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఒకవైపు హాలీవుడ్‌లో నటిస్తూనే, భారతదేశంలో భిన్నమైన పరిశ్రమల వైపు పీసీ ప్రయాణం ఆసక్తిని రేకెత్తిస్తోంది. కేవలం హిందీ పరిశ్రమకే పరిమితం కావాలనే ఆలోచన తనకు లేదు. ప్రస్తుతం టాలీవుడ్ లో నటిస్తూనే మరాఠా చిత్రానికి పని చేస్తోంది. -వారణాసి- సక్సెస్ తర్వాత పీసీ మరిన్ని తెలుగు చిత్రాల్లో నటించేందుకు అవకాశం ఉంది.



సిద్దూ పదో సినిమా.. సుకుమార్ టీమ్ నుంచి మరో దర్శకుడు!

'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' సినిమాలతో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్నారు సిద్దూ జొన్నలగడ్డ. ముఖ్యంగా ఆయన కామెడీ టైమింగ్, డైలాగ్ డెలివరీకి స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉంది. అయితే ఇప్పుడు తన పదో సినిమా కోసం మరో లవ్ స్టోరీని లైన్ లో పెట్టాడు. ఈసారి సుకుమార్ టీమ్ నుంచి వస్తున్న కొత్త దర్శకుడితో పనిచేయబోతున్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఈ సినిమాను అధికారికంగా ప్రారంభించారు.

సుకుమార్ దగ్గర పనిచేసిన మోహన్ బి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సిద్దూ కోసం ఆయన ఒక రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కథను సిద్ధం చేశారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా సిద్దూను చూపించబోతున్నట్లు చిత్రబృందం చెబుతోంది. అతని సరసన నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో మరో విశేషం సంగీత దర్శకుడు జివి ప్రకాశ్ కుమార్. ప్రేమకథ కావడంతో పాటలకు కూడా మంచి ప్రాధాన్యం ఉండనుంది. సినిమాటోగ్రఫీ కోసం చంద్రు సెల్వరాజ్‌ను తీసుకున్నారు. సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్ అందిస్తున్నారు. సిద్దూ గత సినిమాల్లో కామెడీకి ఎక్కువ చోటుండగా, ఈసారి రొమాన్స్‌కు ప్రాధాన్యం ఇచ్చేలా కథను రూపొందించారు.

తమిళ ఇంటర్వ్యూలో తెలుగు సినిమాకు ఎలివేషన్

ఇతర భాషలకు చెందిన నటీనటులు, టెక్నీషియన్లు తమ అనువాద చిత్రాల ప్రమోషన్ల కోసం తెలుగు రాష్ట్రాలకు వచ్చినపుడు స్టేజ్ మీద లేదా ఇంటర్వ్యూల్లో మన ఇండస్ట్రీని, మన ప్రేక్షకులను తెగ కొనియాడేయడం మామూలే. కానీ తమ రాష్ట్రంలో ఉన్నపుడు వాళ్లు వాళ్ల ఇండస్ట్రీని, వాళ్ల భాషను, వాళ్ల ప్రేక్షకులనే పొగుడుకుంటారు. కానీ సీనియర్ నటి సంగీత మాత్రం తాను భిన్నమని చాటింది. ఆమె చెన్నైలో కూర్చుని ఒక తమిళ యాంకర్‌కు ఆ భాషలో ఇంటర్వ్యూ ఇస్తూ.. తెలుగు సినిమా పరిశ్రమకు ఎలివేషన్ ఇచ్చింది. తెలుగు సినిమాలే తన ఫేవరెట్ అని, ఇక్కడ నటించడమే తనకు ఎక్కువ ఇష్టమని.. తమిళ చిత్రాలు చేయడం పట్ల తనకు ఆసక్తి ఎంతమాత్రం లేదని ఆమె తేల్చి చెప్పడం విశేషం. ఇందుకు ప్రధాన కారణం తెలుగు చిత్రాల్లో ఉండే గౌరం తనకు తమిళ సినిమాల నుంచి రావట్లేదని ఆమె కుండబద్దలు కొట్టింది. తమిళ అమ్మాయే అయిన సంగీత.. తమిళుడే అయిన క్రిష్‌ను పెళ్లాడి, చెన్నైలో సెటిలైంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో సంగీత ఐదు భాషల్లో నటించడం గురించి ప్రస్తావించిన యాంకర్.. వీటిలో మీ ఫేవరెట్ ఏది అని అడిగింది. ఫస్ట్ ఛాయిస్ తమిళం అని చెబుతారు, అది కాకుండా వేరే భాష చెప్పండి అని యాంకర్ అంది. ఐతే సంగీత.. తమిళం నా ఫేవరెట్ కాదు అని స్పష్టం చేసింది. తనకు తెలుగు సినిమాలంటేనే ఎక్కువ ఇష్టమని, అవే తన ఫస్ట్ ఛాయిస్ అని తెలిపింది. తెలుగు సినిమాల్లో తనకు దొరికిన గౌరవం ఇంకెక్కడా రాలేదని చెప్పిన సంగీత.. ఇక్కడ మంచి పాత్రలతో పాటు పారితోషకం కూడా బాగా ఇస్తారని వెల్లడించింది. తమిళ ఇండస్ట్రీలో మాత్రం తనను ఎవ్వరూ, ఎప్పుడూ గౌరవించింది లేదని ఆమె తెలిపింది.





పదేళ్ల ప్రేమాయణం తర్వాత సైలెంట్ గా ప్రియుడిని పెళ్లి చేసుకున్న ఇరుముడి హీరోయిన్!

తమిళ నటిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్న ప్రియా భవాని శంకర్ ఇండస్ట్రీలోకి రాకముందు న్యూస్ రీడర్గా తన కెరియర్ ప్రారంభించింది. ఆ తర్వాత 2014లో సీరియల్స్ ద్వారా టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టిన ఈమె 2017లో మేయా దమాన్ అనే తమిళ సినిమా ద్వారా నటిగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. అయితే 2006లోనే కేడి అనే చిత్రంలో చిన్న పాత్ర పోషించింది. కానీ దీంతో ఈమె ఒక పెద్దగా గుర్తింపు రాలేదు. ఆ తర్వాత తమిళంలో పలు చిత్రాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె తొలిసారి తెలుగులో సంతోష్ శోభన్ హీరోగా, అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వం వహించిన కళ్యాణం కమనీయం అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. భీమా , జీబ్రా వంటి చిత్రాలతో పలకరించింది కానీ అవన్నీ ప్లాప్ గా నిలిచాయి. కానీ ఈ ఏడాది ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో సీనియర్ స్టార్ హీరో రవితేజ హీరోగా నటించిన ఇరుముడి చిత్రంలో హీరోయిన్గా నటించి, భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇకపోతే గతంలోనే తన బాయ్‌ఫ్రెండ్ ను పరిచయం చేసిన ఈమె.. గత పదేళ్లుగా తన క్లాస్మేట్ రాజ్ వేల్ రాజ్ తో ప్రేమలో మునిగి తేలుతున్న విషయం తెలిసిందే. అయితే దీపావళి సందర్భంగా నవంబర్ 10వ తేదీన అత్యంత సన్నిహితులు , కుటుంబ సభ్యుల సమక్షంలో తన ప్రియుడితో ఎంగేజ్మెంట్ చేసుకొని ఆ ఫోటోలను అభిమానులతో పంచుకుంది. అయితే ఇప్పుడు సడన్గా పెళ్లి కూడా చేసుకొని మరో సర్ప్రైజ్ ఇచ్చింది ఈ ముద్దుగుమ్మ. ఎలాంటి హడావిడి , ముందస్తు ప్రకటన లేకుండానే సింపుల్గా వివాహ బంధంలోకి అడుగు పెట్టేసింది. కేవలం అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులు మాత్రమే ఈ వేడుకకు హాజరైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఏదేమైనా నిన్న నిశ్చితార్థం చేసుకొని అందర్నీ ఆశ్చర్యపరిచిన ఈమె.. ఇప్పుడు మరీ సింపుల్ గా పెళ్లి చేసుకుని అభిమానులకు సర్ప్రైజ్ ఇచ్చింది. ప్రస్తుతం ప్రియా భవాని శంకర్ పెళ్లి చేసుకోవడంతో పలువురు సినీ సెలబ్రిటీలు ఈ నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA